ఓ బావి.. ట్యాంకు

● గతానికి గురుతులుగా శిథిలావస్థలో..



తూపల్లిలో పురాతన నీటి బావి, ట్యాంక్

దశాబ్దాల గతానికి గురుతుగా నిలిచిన నీటి ట్యాంకు నేడు శిథిలమవుతోంది. మండలంలోని తూపల్లిలో ఓ పొలంలో 70 ఏళ్ల కిందట తాగునీటి కోసం బావిని తవ్వారు. దాని పక్కనే రాళ్లతో స్తంభాలను నిర్మించి వాటి మీద ఓ ఇనుప ట్యాంకును అమర్చారు. కరెంటు లేని ఆ కాలంలో ఆయిల్ ఇంజన్లతో బావిలోని నీటిని తోడి ట్యాంక్‌ను నింపేవారు. అక్కడి నుంచి గ్రామంలో ఓ చోటుకు పైప్‌లైన్ వేసి, దానికి రెండు, మూడు కొళాయిలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా గ్రామ ప్రజలు తమ నీటి అవసరాలను తీర్చుకునేవారు. అయితే వరుస కరువుల నేపథ్యంలో కొన్నేళ్ల కిందట బావి ఎండిపోయింది. దీంతో గ్రామస్థులు, ప్రభుత్వం బోరుబావులు తవ్వుకుని వాటి ద్వారా నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. తర్వాత వర్షాలు కురిసి బావిలో నీరు చేరినా వాటిని వినియోగించలేదు. అలా ఏళ్లు గడవడంతో ఆ బావి, ఆ ట్యాంకు గతానికి గురుతులుగా శిథిలావస్థలో మిగిలి ఉన్నాయి. -ఆంధ్రజ్యోతి, గాండ్లపెంట

కోడి.. కొనండి..!



కోడిని చూపించి కోడి పిల్లలను విక్రయిస్తున్నారు ఓ చిరు వ్యాపారి. దిచక్ర వాహనంపై ఊరూరా తిరుగుతూ.. గిరి రాజా, వన రాజా రకం కోడి పిల్లలను అమ్ముతున్నారు. అట్ట పెట్టెలో కోడి పిల్లలు, దానిపైన ప్రదర్శనకు ఓ కోడి పుంజును కట్టుకుని కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నారు. 'ఒక పిల్లను కొనండి.. ఐదు కేజీల కోడి అవుతుంది' అని వ్యాపారి ఊరిస్తుంటే.. కొనేందుకు జనం ఆసక్తి చూపించారు. రొద్దం మండలం ఆర్. మరువపల్లి సమీపంలో మంగళవారం ఇలా కోడి పిల్లలను అమ్ముతూ కనిపించారు.

-రొద్దం, ఆంధ్రజ్యోతి

ఈయన పేరు కురుబ వెంకటేశులు. పెనుకొండ మండలం కోనాపురం గ్రామానికి చెందిన రైతు. తనకున్న 40 సెంట్ల భూమిలో రబీలో వరి సాగు చేశాడు. పెనుకొండలోని ఓ ఫర్టిలైజర్ షాపులో విత్తనాలు తీసుకొచ్చి, పంట పెట్టాడు. రూ.20 వేల వరకు పెట్టుబడి పెట్టాడు. సాధారణంగా 20 బస్తాలకుపైగా దిగుబడి వస్తుంది. వెంకటేశులు సాగుచేసిన పంట వెన్ను దశలో జొల్లుపడి పూర్తిగా దెబ్బతింది. దీంతో 4 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. నకిలీ విత్తనాలే ఇందుకు కారణమనీ, నిండా మునిగిపోయానని ఆయన వాపోతున్నాడు.



2 లక్షల పెట్టుబడి.. బస్తాల దిగుబడి..



ఈయన పేరు శ్రీనివాసరెడ్డి. పెనుకొండ మండలం కొండాపురానికి చెందిన రైతు. తనకున్న ఐదెకరాల్లో రబీలో మొక్కజొన్న సాగు చేశాడు. పెనుకొండలోని ఓ ఫర్టిలైజర్ షాపులో విత్తనాలు తీసుకొచ్చి, పంట పెట్టాడు. రూ.2లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. నాసిరకం విత్తనాలు కావడంతో పంట వెన్నదశలో దెబ్బతింది. కంకులు చిన్నగా ఏర్పడడంతో 2 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. 150 క్వింటాళ్లుపైగా దిగుబడి రావాల్సి ఉండగా.. రెండు క్వింటాళ్లే రావడంతో రైతు నిండా మునిగాడు.

- రైతును నిండాముంచిన నకిలీ విత్తనాలు
- కీలక దశలో దెబ్బతిన్న మొక్కజొన్న, వరి పంటలు
- సర్వం నష్టపోయిన అన్నదాతలు
- చోద్యం చూస్తున్న వ్యవసాయాధికారులు



పెనుకొండ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు రైతును నట్టేట ముంచాయి. రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టి మొక్కజొన్న సాగుచేస్తే 2 క్వింటాళ్లు కూడా దిగుబడి రాలేదు. అన్నదాత సర్వం నష్టపోయాడు. మండలంలో నకిలీ విత్తనాల కారణంగా చాలా మంది రైతులు నష్టపోయారు. ఫర్టిలైజర్ షాపుల ధనదాహమే తమ దుస్థితికి కారణమని అన్నదాతలు వాపోతున్నారు. నకిలీ విత్తనాలతో నిండా ముంచేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. రైతులు అప్పులుచేసి పంట పెడితే నకిలీ విత్తనాల కారణంగా సర్వం నష్టపోతున్నాడు. పెనుకొండలో విచ్చలవిడిగా ఫర్టిలైజర్ షాపులున్నాయి. నకిలీ విత్తనాలు దిగుమతి చేసుకుని రైతులకు అంటగడుతున్నారు. వాటిని సాగుచేసిన రైతన్నలు లబోదిబోమంటున్నారు. రబీలో మండలవ్యాప్తంగా వరి, మొక్కజొన్న విస్తారంగా సాగుచేశారు. పెనుకొండలోని ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసి, పంటలు పెట్టారు. లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టారు. వెన్నదశలో పంటలు దెబ్బతిన్నాయి. కంకులు చిన్నగా ఏర్పడడంతో దిగుబడి దారుణంగా పడిపోయింది. దీంతో అన్నదాతలు అప్పులపాలయ్యారు. నకిలీ విత్తనాల దందా జోరుగా సాగుతున్నా.. కట్టడి చేయాల్సిన వ్యవసాయాధికారులు చోద్యం చూస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

ఫిర్యాదు చేస్తే.. తనిఖీలు చేస్తాం

ఫర్టిలైజర్ షాపుల్లో నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు రైతులు ఫిర్యాదు చేస్తే తనిఖీచేసి, సీజ్ చేస్తాం. నకిలీ విత్తనాల విక్రయాలపై చర్యలు చేపడతాం.

-కృష్ణమీనన్, ఇన్‌చార్జి ఏడీఏ

ఆగుతూ... సాగుతూ..

హెచ్చెల్సీ అభివృద్ధి పనుల్లో జాప్యం

పనులకు వానదెబ్బ.. ఇంజనీర్ల నిర్లక్ష్యం

రూ.33.89కోట్లతో చేపట్టిన 11పనులపై నీలినీడలు

మూడు నెలలు కావస్తున్నా సగం కూడా పూర్తికాని వైనం

అనుకున్న సమయానికి పనుల పూర్తిపై సందేహం



137.702 కిలోమీటరు వద్ద కొనసాగుతున్న అండర్‌టన్నెల్ పనులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ పనుల్లో జాప్యం జరుగుతోంది. దీంతో వచ్చే నెలాఖరుకు పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. అయితే జూలై ఒకటిన కాలువకు నీటిని విడుదల చేస్తామని టీబీ డ్యాం బోర్డు అధికారులు ఇప్పటికే చెప్పారు. పనులు జరుగుతున్నందున జూలై ఆఖరులో ఇవ్వాలని జిల్లా ఇంజనీర్లు టీబీ డ్యాం బోర్డుకు విజ్ఞప్తి చేసుకున్నారు. అయితే ఈ పనుల జాప్యంతో జిల్లాకు ఎక్కువ నీటిని తీసుకునే అవకాశాన్ని కోల్పోయే పరిస్థితి నెలకొంది. చేపట్టిన పనులు నెలరోజుల్లో పూర్తి చేసి జిల్లాకు అధికంగా నీటిని అందించి, పంటల సాగుకు ఊతమివ్వాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగ విరమణలతో సమస్యలు

ఏప్రిల్ నెలాఖరులో హెచ్చెల్సీ రెగ్యులర్ ఎస్ఈ రాజశేఖర్ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఈ నెలలో నంద్యాల ఎస్ఆర్‌బీసీ ఎస్ఈ పురార్ధన్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఆయన కేవలం మూడు సార్లు మాత్రమే అనంతపురానికి వచ్చారు. ఈయన కూడా ఈనెలాఖరులో ఉదోయగ విరమణ పొందనున్నారు. అంతేగాక హెచ్చెల్సీలో ప్రధాన విభాగమైన లోకలైజేషన్ ఈఈగా ఉన్న వెంకటరమణారెడ్డి గత నెలలో రిటైర్డ్ అయ్యారు. ఇలా కీలక పోస్టుల్లో ఇన్‌చార్జిలు ఉండటంతో పర్యవేక్షణ (మిగతా 6లో...)

ఖాద్రీశుడి ఆలయంలో మెనూ మార్పు



వయోవృద్ధులకు ప్రత్యేక క్యూలైన్

కదిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తులకు అందించే నిత్యాన్నదానం మెనూలో మార్పు చేసినట్లు ఈఓ శ్రీనివాసరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మార్పులు గురువారం నుంచి అమలవుతాయన్నారు. అల్పాహారం సోమవారం వెజిటబుల్ ఉప్మా, చెట్నీ, మంగళవారం ఉగ్గాని, చెట్నీ, బుధవారం బిసిబేలబాత్, గురువారం విజిటబుల్ ఉప్మా, చెట్నీ, శుక్రవారం బిసిబేలబాత్, శనివారం పెసరపప్పు పొంగలి, సాంబరు, ఆదివారం పెసరపప్పు పొంగలి, చెట్నీ, అన్నప్రసాదంలోకూడా సమూల మార్పులు తెచ్చారు. ప్రతిరోజు వివిధరకాల పాయసంతోపాటు, అన్నం, పప్పు, రోజుకో పచ్చడితోపాటు కూరగాయల తాళింపులతో వడ్డిస్తామన్నారు. ఆలయంలో పసిపిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గది, వయోవృద్ధులు, దివ్యాంగులకు వీల్ చైర్ సౌకర్యం, వయోవృద్ధులు, చిన్నారుల తల్లిదండ్రులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



రైతులకు సబ్సిడీ చెక్కును అందజేస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

1,021 మంది రైతులకు రాయితీ యంత్రాలు

- కలెక్టర్ టీఎస్ చేతన్
- సబ్సిడీ చెక్కు అందజేత


పుట్టపర్తి టౌన్, జూన్18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 1,021 మంది రైతులకు రాయితీ యంత్రాలు పంపిణీ చేసినట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాయితీకి సంబంధించిన కలెక్టర్ బుధవారం రైతులకు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులకు యంత్రాల రాయితీ కోసం రూ.1.72 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. రోటావేటర్లు, స్ప్రేయర్లు, నూర్పిడి యంత్రాలను రైతుసేవాకేంద్రాల ద్వారా పంపిణీ చేశామన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఉద్యాన వన శాఖాధికారి చంద్రశేఖర్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

డొక్కలు నిండేలా...!

పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం అమలు

- సన్న బియ్యంతో వండిన అన్నాన్ని ఇష్టంగా తింటున్న విద్యార్థులు
- జిల్లాలోని 2023 ప్రభుత్వ విద్యాలయాల్లో పథకం ప్రారంభం

కొత్తచెరువు/బత్తలపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తోంది. విద్యా సంవత్సరం ఆరంభం నుంచే పాఠశాలల్లో సన్నబియ్యంతో వండిన ఆహారం విద్యార్థులకు అందజేస్తున్నారు. గతంలో లావు బియ్యంతో ముద్ద ముద్దగా వండిన అన్నం తినలేక చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకునేవారు. దీన్ని గుర్తించిన ప్రస్తుత ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద సన్న బియ్యంతో వండిన అన్నాన్ని విద్యార్థులకు అందిస్తోంది. జిల్లాలో 2023 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 106057 మంది విద్యార్థులు ఉన్నారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెలా 2,482.75 క్వింటాళ్ల సన్నబియ్యాన్ని సరఫరా చేస్తోంది. గతంలో లావు బియ్యంతో చేసే అన్నం పిల్లలు సరిగా తినకపోవడంతో ఎక్కువగా మిగిలేదని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు. ప్రస్తుతం సన్నబియ్యంతో చేస్తుండటంతో పిల్లలు బాగా తింటున్నారని, దీంతో అన్నం వృథా తగ్గిందని పలువురు నిర్వాహకులు పేర్కొన్నారు.



సన్నబియ్యంతో వండిన అన్నం



కొత్తచెరువు జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో సన్నబియ్యం అన్నాన్ని విద్యార్థులకు వడ్డిస్తున్న దృశ్యం

ఎ, బి12, డి, ఈ విటమిన్లతో కూడిన భోజనం

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంలో విద్యార్థుల్లో రోగనిరోధక శక్తిని పెంచే ఎ, బి12, డి, ఈ విటమిన్లతో పాటు జింక్, ఐరన్, అయోడిన్ వంటి ఖనిజ పోషకాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ సన్నబియ్యంలో మైక్రోన్యూట్రియన్లు కూడా సమృద్ధిగా ఉంటాయి. ఇంత బలవర్ధకమైన బియ్యంతో తయారు చేసిన భోజనాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందజేస్తున్నారు. పిల్లలు కూడా గతంలో కంటే ఎక్కువ ఇష్టంగా ఈ భోజనం తింటున్నట్లు ఉపాధ్యాయులు, ఏజెన్సీ నిర్వాహకులు చెబుతున్నారు.

చాలా రుచిగా ఉంది



ప్రభుత్వ పాఠశాలలో సన్న బియ్యంతో చేసిన అన్నం చాలా రుచిగా ఉంది. దీంతో కడుపు నిండా తింటున్నాం. ఆకలి తీరడంతో చదువు పై బాగా దృష్టి సారిస్తున్నాం. మంచి మార్కులు తెచ్చుకునేందుకు కృషి చేస్తాం.

- సుప్రియ, పదో తరగతి, బత్తలపల్లి

జిల్లాలో డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలవుతున్న పాఠశాలలు

పాఠశాలల పేర్లు	స్కూళ్ల సంఖ్య	విద్యార్థులు	బియ్యం బ్యాగులు
1.మోడల్ స్కూల్	10	1,764	415
2.ప్రాథమిక పాఠశాలలు	1527	43,071	2,555
3.ప్రాథమికోన్నత	226	30,204	1901
4.హైస్కూళ్లు	249	25,584	3,687
5.జూనియర్ కళాశాలలు	21	5,452	1373

బాక్సు తెచ్చుకోవడం మానేశా



గతంలో పాఠశాలలో చేసే మధ్యాహ్న భోజనం ముద్దగా ఉండటంతో తినలేక ఇంటి నుంచి బాక్సు తెచ్చుకొనేవాడిని. ఇంటి వద్ద భోజనం సిద్ధం కానప్పుడు ఒక్కోసారి పస్తులున్న రోజులు ఉన్నాయి. కానీ ఇప్పుడు సన్నబియ్యంతో పెడుతున్న భోజనం తినడానికి బాగుంది. దీంతో ఇంటి నుంచి బాక్సు తెచ్చుకోవడం మానేశా. ఈ విధానం ఇలాగే కొనసాగించాలి.

-హర్షవర్ధనాచారి, పదోతరగతి, కొత్తచెరువు

అన్నం బాగుంది



సన్నబియ్యంతో చేస్తున్న అన్నం బాగుంది. గతంలో లావు బియ్యంతో చేసిన అన్నం ఉడికీ ఉడకనట్లు ఉండేది. తినడానికి కూడా బాగుండేది కాదు. ఇప్పుడు ఇంటిలో మాదిరిగానే అన్నం ఉంది. దీంతో నాతోపాటు చాలమంది విద్యార్థులు ఇక్కడే భోజనం తింటున్నారు.

-హేమశ్రీ, ఎనిమిదో తరగతి, కొత్తచెరువు

జీవిత ఖైదీకి స్వేచ్ఛ



"చెన్నైలో ఉండేవాడిని. పెళ్లి చేసుకున్నాక తిరుపతిలో ఓ మెడికల్ షాపులో పనిచేసేవాడిని. కుటుంబ కలహాల కారణంగా నా భార్య మృతిచెందింది. దీంతో నాపై వరకట్నం కేసు నమోదైంది. కోర్టులో విచారణ అనంతరం 2006లో నాకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. కడప జైలులో పదేళ్లు శిక్ష అనుభవించాను. సత్ప్రవర్తన కారణంగా పెనుకొండ జైలుకు మార్చారు. ఇక్కడ ఏడున్నర సంవత్సరాలు శిక్ష అనుభవించాను. రాష్ట్ర ప్రభుత్వం నాకు క్షమాభిక్ష పెట్టింది. నా కూతురు, కొడుకు ఇంటర్ చదువుతున్నారు. ఏదైనా పని చేసుకుంటూ వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటాను. నన్ను విడుదల చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు"

-సురేష్ బాబు, పెనుకొండ సబ్ జైలు నుంచి విడుదలైన ఖైదీ

(మరిన్ని వివరాలు 7లో..)

ఏం పనులు చేశారో చెప్పండి..?

అధికారులను ప్రశ్నించిన కేంద్ర బృందం

ఉపాధి నిధులతో చేసిన పనులపై ఆరా

7

సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

6





బోగీలో భోజనం..!

● ఆకట్టుకుంటున్న రైలు కోచ్ రెస్టారెంట్ ● అనంత రైల్వేస్టేషన్ లో అందుబాటులోకి..

అనంతపురం న్యూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణంలో భోజనం చేయడం అంటే ఓ ప్రత్యేక అనుభూతి. అందులోనూ ఏసీ బోగీలో అయితే ఆ ఫీలే వేరు. నలుగురు స్నేహితులతోనో, సన్నిహితులతోనో కబుర్లు చెబుతూ కాఫీ సిప్ చేస్తూ.. స్నాక్స్ తింటూ ఉంటే ఆ ఆనందాన్ని మాటల్లో వర్ణించలేం. అలాంటి గొప్ప అనుభూతి తరచూ పొందాలని అందరూ కోరుకుంటుంటారు. అది కుదిరే పనికాదు, రైలు ప్రయాణమే చేయాలి, తోడుగా స్నేహితులూ ఉండాలి. అది ఎప్పుడో తప్ప.. వీలుకాదు. ఆ కోరికను నెరవేర్చుకునేందుకు అనంతపురం రైల్వే స్టేషన్‌లో రైలు కోచ్ రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. ఏకంగా ఓ ఏసీ బోగీనే అందుకు వినియోగించారు. బోగీలోని సీట్లలో కూర్చుని, కబుర్లు చెబుతూ కాఫీ, స్నాక్స్, భోజనం చేసే వెసులుబాటు కల్పించారు. 24 గంటలు ఈ రెస్టారెంట్ ఓపెన్‌లోనే ఉంటుంది. రైలు బోగీలో భోజనం చేయడానికి నగర ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

డీడీగా శ్రీనివాసరావు నియామకం

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకుడి(డీడీ)గా శ్రీనివాసరావు నియమితుడయ్యారు. ఇక్కడ డీడీగా పనిచేస్తున్న రామాంజనేయులును మాతృశాఖ పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసరావును అనంతకు ప్రభుత్వం నియమించింది. ఈమేరకు రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన సోమవారం విధుల్లో చేరే అవకాశాలున్నాయని ఆ శాఖ వర్గాల ద్వారా తెలుస్తోంది.

సమగ్రశిక్షలోనూ బదిలీలు

● రిక్వెస్ట్, మ్యూచువల్స్‌కే అవకాశం
● 21 వరకు దరఖాస్తులు ● ఏపీసీ శైలజ వెల్లడి

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్షలోనూ బదిలీల ప్రక్రియ మొదలైంది. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సమగ్రశిక్ష ఏపీసీ శైలజ వెల్లడించారు. జిల్లాలోని కేజీబీవీల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, మండలస్థాయిలో పనిచేస్తున్న ఐఈఆర్‌పీ, పీటీ, సీఆర్‌ఎంటీలు, అకౌంటెంట్లు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెసెంజర్లు, ఆఫీస్ సబార్డినేట్లు, సైట్ ఇంజినీర్లకు బదిలీలు నిర్వహిస్తామన్నారు. రిక్వెస్ట్, మ్యూచువల్ బదిలీలకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అలాంటి వారు ఈనెల 21వతేదీలోగా దరఖాస్తును జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. అభ్యర్థుల స్టేషన్ సీనియారిటీ, స్పెషల్ సర్వీస్ సీనియారిటీ పాయింట్లను ఈఏడాది ఏప్రిల్ 30 వరకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లాలనుకునేవారు దరఖాస్తులను రాష్ట్ర కార్యాలయానికి పంపించాల్సి ఉంటుందని ఏపీసీ వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన వయోజన విద్య డీడీ వెంకటేశ్వర్లు


డీడీ వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది, విద్యాపర్యవేక్షకులు

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వయోజన విద్య ఉపసంచాలకుడి(డీడీ)గా వెంకటేశ్వర్లును ప్రభుత్వం నియమించింది. ఇక్కడ పనిచేస్తున్న డీడీ ఆంజనేయులును గుంటూరుకు బదిలీ చేసారు. ఆయన స్థానంలో కర్నూలు జిల్లాలో ఏడీగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఇక్కడికి డీడీగా నియమిస్తూ బుధవారం వైద్యశాఖ కమిషనర్ ఉత్తర్వులు జా రీ చేశారు. దీంతో బుధవారం వెంకటేశ్వర్లు జిల్లాకు చేరుకుని, తొలుత కలెక్టర్‌ను కలిశారు. అనంతరం జిల్లా వయోజన విద్య కార్యాలయానికి చేరుకుని, అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. డీడీ వెంకటేశ్వర్లుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కష్టపడ్డోళ్లను గుర్తిస్తాం

● టీడీపీ అర్బన్ పరిశీలకుడు సోమిశెట్టి ● పార్టీ సంస్థాగత ఎన్నికలపై సమావేశం

అనంతపురం క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసినవారిని వంద శాతం గుర్తిస్తామని టీడీపీ సంస్థాగత ఎన్నికల పరిశీలకుడు సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ అర్బన్ నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల సమావేశాన్ని నగరంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిశెట్టి మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టారని అన్నారు. అయినా చాలా మంది పార్టీ కోసం కష్టపడ్డారని అభినందించారు. నామినేటెడ్ పోస్టుల కోసం 150 నుంచి 170 మంది వివరాలను పార్టీ హైకమాండ్‌కు పంపామని తెలిపారు. చిన్న పొరపాట్లు ఉన్నా సర్దుకుని వెళ్లాలని, అందరికీ న్యాయం జరుగుతుందని అన్నారు. 2029లో చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేసేలా పనిచేయాలని సూచించారు. అంతకు ముందు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ చౌదరి, టీడీపీ కుమ్మర శాలివాహన సంఘం రాష్ట్ర కన్వీనర్ పోతులయ్య మాట్లాడారు. 2019 నుంచి 2024 వరకూ ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చాలా మంది కార్యకర్తలు కష్టపడి పనిచేశారని అన్నారు. టీడీపీలో కుల మతాలు ఉండవని, పార్టీ నిర్ణయమే ఫైనల్ అని అన్నారు. బాగా కష్టపడి ఎమ్మెల్యేని గెలిపించారని, అదే స్ఫూర్తితో కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించేలా ముందుకెళ్లాలని సూచించారు. టీడీపీలో కార్యకర్తే అధినేత అని జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ అన్నారు. కష్టపడే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. సెంట్రల్ పార్టీ ఐవీఆర్ఎస్ ద్వారా పదవులకు అర్హులను ఎంపిక చేస్తుందని తెలిపారు.

కళ్లలో పెట్టి చూసుకుంటా: దగ్గుపాటి

టీడీపీ కార్యకర్తలను ఐదేళ్లపాటు వైసీపీ ఎంతగానో ఇబ్బంది పెట్టిందని, అయినా తనను భారీ మెజారిటీతో గెలిపించారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. కార్యకర్తలను కళ్లలో పెట్టుకుని చూసుకుంటానని అన్నారు. తన గెలుపు కోసం పనిచేసినవారితోపాటు పని చేయని వారు వచ్చి అడిగినా పనులు చేయడానికి, సేవ చేయడానికి సిద్ధంగా ఉంటానని అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో కార్యకర్తలకు 24 గంటలు అందుబాటులో ఉంటామని అన్నారు. నగరంలో అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని, 35 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న డంపింగ్ యార్డ్‌ను దూరంగా తరలించి సమస్య లేకుండా చేస్తామని అన్నారు. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసినవారిని గుర్తించి, సంస్థాగత ఎన్నికల్లో పదవులు ఇస్తామని తెలిపారు. డివిజన్, ఇతర పదవుల్లో న్యాయం చేస్తామని అన్నారు. పోటీ లేని చోట, అభ్యర్థులు లేని చోట ఏకగ్రీవంగా ఎంపిక చేస్తామని తెలిపారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

శతజయంతిని జయప్రదం చేయాలి

కలెక్టర్ టీఎస్ చేతన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ, జేసీ

పుట్టపర్తి టౌన్, జూన్18(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను జయప్రదం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సత్యసాయి శతజయంతి ఏర్పాట్లపై బుధవారం ఎస్పీ రత్న, జేసీ అభిషేక్‌కుమార్‌తో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యసాయి శత జయంతి వేడుకలకు దేశవిదేశాల నుంచి పదిలక్షలమందికిపైగా భక్తులు, ప్రజలు పుట్టపర్తికి వచ్చే అవకాశం ఉందన్నారు. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడానికి ఇప్పట్నుంచే ఏర్పాట్లు చేయాలన్నారు. పలువురు ప్రముఖులు హాజరవనున్న నేపథ్యంలో భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చిత్రావతి నది సుందరీకరణ పనులు వేగం పెంచాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో విజయసారధి, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, జిల్లా వైద్యాధికారి ఫైరోజ్‌బేగం, తదితర అధికారులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

ఈనెల 21న జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్షించారు. యోగాంధ్ర కార్యక్రమం విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

సప్లిమెంటరీ ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న డైరెక్టర్ తదితరులు

అనంతపురంరూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలోని పలు సప్లిమెంటరీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్‌నాయుడు బుధవారం విడుదల చేశారు. బీటెక్ నాలుగో సంవత్సరం ఒకటో సెమిస్టర్(ఆర్20), (ఆర్19) (ఆర్15), బీఫార్మసీ ఫస్టియర్ రెండో సెమిస్టర్(ఆర్23), (ఆర్19), (ఆర్15) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేశారు. ఆచార్య నాగప్రసాద్ నాయుడు మాట్లాడుతూ.. ఈఏడాది ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేశామన్నారు. విద్యార్థులు ఫలితాల కోసం జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్స్ ఆచార్య శివకుమార్, ఆచార్య శంకరశేఖర్ రాజు, డా. శ్రీధర్, డా.అంకారావు పాల్గొన్నారు.

డాబా వద్ద ఘర్షణ

పరిటాల శ్రీరామ్, గోనుగుంట్ల అనుచరులపై కేసు


గాయపడిన అరవిందరెడ్డి, నాగరాజు, ఖాశీం వలి

చెన్నేకొత్తపల్లి/ధర్మవరం, జూన్18(ఆంధ్రజ్యోతి): చెన్నేకొత్తపల్లి సమీపంలోని ఓ డాబా వద్ద మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ వర్గీయులు బుధవారం పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ గొడవలో మాజీ ఎమ్మెల్యే ప్రధాన అనుచరుడు చిగిచెర్ల అరవింద రెడ్డి, పరిటాల శ్రీరామ్ అనుచరులు నాగరాజు, ఖాశీం వలి గాయపడ్డారు. ఇరువర్గాలపై హత్యాయత్నం కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. టీడీపీ కార్యకర్తల ఫిర్యాదు మేరకు, దామాజుపల్లికి చెందిన ఖాశీం వలి, నాగరాజు డాబా వద్ద టీ తాగుతూ పరిటాల శ్రీరామ్ గురించి చర్చించుకుంటున్నారు. అదే సమయంలో ధర్మవరం మండల చిగిచెర్లకు చెందిన అరవింద రెడ్డి మరికొందరు అక్కడికి వచ్చారు. పరిటాల శ్రీరామ్ గురించి ఎందుకు చర్చించుకుంటున్నారని అరవిందరెడ్డి విమర్శించాడు. దీంతో వారి మధ్య వాగ్వాదం మొదలైంది. అరవిందరెడ్డి డాబాలో ఉన్న వంటగదిలోకి వెళ్లి కత్తి తీసుకుని టీడీపీ కార్యకర్తలపై దాడికి యత్నించాడు. వారు పారిపోతున్నా వెంబడించడంతో ఎదురుతిరిగారు. పరస్పరం దాడులు చేసుకున్నారు. గాయపడిన ముగ్గురిని అనంతపురంలోని వేర్వేరు ప్రైవేటు ఆస్పత్రులకు తరలించారు. టీడీపీ కార్యకర్త నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు అరవిందరెడ్డిపై కేసు నమో దు చేశారు. కాగా, పరిటాల శ్రీరామ్ అనుచరుడు వెంకటేశ్ యాదవ్ పెనుకొండలో పని ఉందని నమ్మబలికి తనను కారులో చెన్నేకొత్తపల్లి సమీపంలోని డాబా వద్దకు తీసుకెళ్లాడని అరవిందరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడికి ఎన్ఎస్ గేటు, దామాజుపల్లికి చెందిన పరిటాల శ్రీరామ్ అనుచరులు ఖాశీం, దుబ్బ, నాగరాజు, పులి తదితరులు వచ్చారని, పరిటాల శ్రీరామ్ గురించి ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతావా అంటూ తనపై దాడిచేశారని పేర్కొన్నారు. అతని ఫిర్యాదు మేరకు పులి, నాగరాజు, ఖాశీం, అంజి, వెంకటేశ్‌యాదవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అదృశ్యమైన మహిళ అప్పగింత

అనంతపురం క్రైం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మహిళ మిస్సింగ్‌పై కేసు నమోదు చేసిన మూడో పట్టణ పోలీసులు ఆమెను కనిపెట్టి బుధవారం బంధువులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన మేరకు నందమూరి నగర్‌కు చెందిన వడ్డే దాక్షాయణి(30), ప్రదీప్‌కుమార్ దంపతులు. పిల్లలతో కలిసి వారు మంగళవారం ఐదో రోడ్డులోని బంధువులు భవానీ ఇంటికెళ్లారు. ప్రదీప్ కుమార్ తండ్రి చనిపోవడంతో బట్టలు పెట్టుకోవడానికి కర్ణాటకలోని బంధువుల ఇంటికెళ్తుండగా... దాక్షాయణి తానూ వస్తానని భర్తను కోరింది. అయితే ఆయన అందుకు ససేమిరా అన్నాడు. దీంతో ఉదయం నుంచీ బాధపడుతున్న ఆమె ఇంట్లోంచి రాత్రి 10 గంటలప్పుడు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనపై ఫిర్యాదు రావడంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు బృందాలుగా వెతికారు. ఆరు గంటల తర్వాత మహిళను కనిపెట్టి, తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి తర్వాత బంధువులకు అప్పజెప్పారు.

కేంద్ర పథకాల అమలులో వెనుకబాటు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి
దిశ సమావేశంలో ఎంపీ అంబికా

అనంతపురం కలెక్టరేట్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్ని కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో వెనుకబడి ఉన్నామని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో దిశ (జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం బుధవారం నిర్వహించారు. ఎంపీ అంబికా అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ శివ్‌నారాయణ్‌శర్మ, జడ్పీ సీఈఓ శివశంకర్, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఆయా శాఖల జిల్లా అధికారులు, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు. ఎంపీ మాట్లాడుతూ.. జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేయాలన్నారు. పబ్లిక్ హెల్త్ శాఖ ద్వారా పట్టణాల్లో అమలు చేస్తున్న రక్షిత మంచి నీటి సరఫరా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వంటి పలు కేంద్ర పథకాల అమలు వివరాలను అధికారులు వివరించారు. డీపీఆర్ స్టేజ్‌లో ఉన్న వివరాలు, నిధుల పెండింగ్ అంశాలు, అమలు చేస్తున్న వాటి పురోగతి వివరాలను అందించాలని ఎంపీ వారికి సూచించారు. అనంతపురం నగరాన్ని స్మార్ట్‌సిటీగా మార్చుకునే అవకాశముందని, కొన్ని పంచాయతీలను కలుపుకోవాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి ప్రస్తుత విలువతో ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. పీఎం ఫసల్ బీమా యోజన పట్ల రైతులకు అవగాహన కల్పించాలన్నారు. నిరుద్యోగులకు కిసాన్ డ్రోన్స్ అందించి ఉపాధి కల్పించేలా చూడాలన్నారు. డ్రిప్ వినియోగంలో జిల్లా ప్రస్తుతం రెండో స్థానంలో ఉండగా, మొదటి స్థానంలోకి రావాలన్నారు. హామీ పథకంలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, పక్కాగా పనులు జరిగేలా చూడాలన్నారు. సోలార్ రూఫ్ టాప్ ఇన్‌స్టాల్ చేసుకునేలా అధికారులు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గుంతకల్లు ప్రభుత్వాసుపత్రి అంబులెన్స్‌కు డ్రైవర్‌ను ఏర్పాటు చేయాలని, డయాలసిస్ ఉన్న ఆసుపత్రుల్లో జనరేటర్ సౌకర్యం వినియోగంలోకి తీసుకోవాలన్నారు. నార్పల, పామిడి బస్టాండ్ ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఉరవకొండ నుంచి గుంతకల్లు మీదుగా విజయవాడకు బస్సు ఏర్పాటు చేయాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ భూసార పరీక్షలను కేటాయించిన లక్ష్యం మేరకు సాధించాలని సూచించారు. ఆర్థిక సంఘం నిధుల కింద జడ్పీకి ఇచ్చే 15శాతం నిధులు కొనసాగించేలా చూడాలని కోరారు. జేసీ శివనారాయణ్ శర్మ మాట్లాడుతూ రైతులను రుణాలను కట్టమని బలవంతం చేయకుండా ఆదేశాలు ఇచ్చామన్నారు. సమావేశంలో దిశా కమిటీ సభ్యులు గీతాంజలి, వన్నూరుస్వామి, రామ్మోహన్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, నాబార్డు ఏజీఎం అనురాధ, పబ్లిక్‌హెల్త్ ఈఈ ఆదినారాయణ, సీపీఓ అశోక్‌కుమార్, హౌసింగ్ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీం బాషా, డీసీహెచ్ఎస్ పాల్‌రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఆగుతూ... సాగుతూ..

(5వ పేజీ తరువాయి)

లేక పనులు జాప్యంగా జరుగుతున్నట్లు చెబుతున్నారు.

ఓ వైపు వర్షం.. మరోవైపు ఇంజనీర్ల నిర్లక్ష్యం

జిల్లాకు ప్రధాన నీటి వనరుగా ఉన్న తుంగభద్ర ఎగువకాలవ (టీబీపీ హెచ్చెల్సీ) కింద మూడు నెలల కిందట ప్రారంభించిన పలు అభివృద్ధి పనులకు వర్షం ఆటంకం కలిగిస్తోంది. అలాగే ఇంజనీర్ల నిర్లక్ష్యం కూడా తోడైంది. హెచ్చెల్సీ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం 11పనులు చేయడానికి గుర్తించింది. ఇందుకోసం రూ.36 కోట్ల నిధులను మంజూరు చేసింది. పనులు పూర్తయితే ప్రస్తుతం 1800క్యూసెక్కులుగా ఉన్న హెచ్చెల్సీ నీటి సామర్థ్యాన్ని 2500క్యూసెక్కులకు పెంచే అవకాశం ఉంటుంది. హెచ్ఎల్ఎంసీ ప్రధాన కాలువతో పాటు ఆయా ప్రాంతాల్లో చాలా చోట్ల కూలిపోయిన బ్రిడ్జిలు, అండర్ టన్నెల్, రెగ్యులేటర్లు మరమ్మతు నిర్మాణ పనులలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

పనులు.... నిధులు

రాష్ట్ర ప్రభుత్వం హెచ్చెల్సీలో అత్యంత ప్రాధాన్యమైన 11 పనులను చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు అవసరమైన రూ.36కోట్లు నిధులను మంజూరు చేసింది. ఇందులో ప్రధానంగా హెచ్ఎల్ఎంసీ ప్రధాన కాలువ 165.028 కిలోమీటర్ వద్ద సగం పూర్తి అయిన బ్రిడ్జిని పూర్తి చేయడానికి రూ.1.59కోట్లు కేటాయించారు. 169.400 కిలోమీటర్ వద్ద వంతెన నిర్మాణానికి రూ.1.91కోట్లు, 155.81కిలోమీటర్ వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణానికి రూ.1.53కోట్లు, 115.167కిలోమీటర్ వద్ద వంతెన పూర్తి చేయడానికి రూ.1.66కోట్లు మంజూరు చేశారు. 117.794కిలోమీటర్ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.80కోట్లు, 147.395కిలోమీటర్ వద్ద పెండింగ్‌లో ఉన్న అవుట్‌పాల్ రెగ్యులేటర్ పూర్తి చేయడానికి రూ.4.21కోట్లు, 137.702కిలోమీటర్ వద్ద అండర్ టన్నెల్ పునర్నిర్మాణానికి రూ.4.21కోట్లు మంజూరు చేశారు. 189.126కిలోమీటర్ వద్ద పీఏబీఆర్ లింకుచానల్ పునర్ నిర్మాణానికి రూ.4.10కోట్లు, 189.126 కిలోమీటర్ వద్ద ఎంపీఆర్ రెగ్యులేటర్ ఓటీ మోపిడి వద్ద రెగ్యులర్ నిర్మాణానికి రూ.4.14కోట్లు, 115 కిలోమీటర్ నుంచి 130కిలోమీటర్ వరకు లైనింగ్ నిర్మాణానికి రూ.9.80కోట్లు మంజూరు చేశారు. కణేకల్లు చెరువు ఒకటో కిలోమీటర్ వద్ద ఆఫ్‌టెక్ స్లూయిస్-3 నిర్మాణానికి రూ.22లక్షలు కేటాయించారు. చేపట్టిన పనులు ఇప్పటి వరకు కేవలం 30శాతం మాత్రమే పూర్తి చేశారు. వచ్చే సీజన్‌లోపు పనుల పూర్తిపై సందేహం నెలకొంది.



ఇవి అత్యంత కీలకం

హెచ్చెల్సీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో 137.702 కిలోమీటరు వద్ద జరుగుతున్న అండర్‌టన్నెల్ నిర్మాణ పనులు సగం కూడా పూర్తి చేయలేదు. 147.395 కిలోమీటరు వద్ద అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ అత్యంత కీలకం. ఇది కూడా సగంలోనే ఉంది. 169.400కిలోమీటరు వద్ద జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులు సగం పూర్తి అయ్యాయి. ఇలా ప్రాధాన్యం కలిగిన నిర్మాణ పనులు జూలై మూడో వారంలోపు పూర్తి చేస్తే టీబీ డ్యాం నుంచి నీటిని ఎక్కువగా తీసుకునేందుకు మార్గం సుగమమవుతుంది. హెచ్చెల్సీ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు కొంత దృష్టి సారించి పనులు పూర్తి చేయాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

కొంత ఆలస్యం వాస్తవమే



హెచ్చెల్సీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులలో కొంత ఆలస్యమవుతున్న మాట వాస్తవమే. ఐదేళ్ల తరువాత హెచ్చెల్సీలో అత్యవసర పనులు గుర్తించి, నిధులు మంజూరు చేశారు. మొత్తం 11పనులకు సంబంధించి రూ.36కోట్లు నిధులు మంజూరు చేశారు. ఏడు నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేపట్టినప్పటికీ ఓ వైపు వర్షాలు, మరోవైపు సాంకేతిక సమస్యలతో పనులు చేయడం కాస్త కష్టంగా మారింది. వచ్చే సీజన్‌లోపు పనులన్నీ పూర్తి చేయాలని సూచించాం. హెచ్చెల్సీకి రెగ్యులర్ ఎస్ఈ లేకపోవడం కొంత మేర ఇబ్బంది పెట్టే అంశమే. జూలై నెలలోపు ప్రభుత్వం సూచించిన పనులను పూర్తి చేసి, కాలవ పటిష్టతకు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఇంజనీర్లకు ఆదేశాలిచ్చాం. ఆ మేరకు పనులు జరుగుతున్నాయి.

- నాగరాజు, జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌ల సీఈ

దిద్దుపాట్లు!

టీచర్ల బదిలీల్లో పొరపాట్లను సరిచేసేందుకు కుస్తీ


కుస్తీ పడుతున్న డీఈఓ, ఏడీ తదితరులు

అనంతపురం విద్య, జూన్ 18(ఆంధ్రజ్యోతి): టీచర్ల బదిలీల్లో సమస్యలు, పొరపాట్లను సరిదిద్దేందుకు విద్యాశాఖ కుస్తీ పడుతోంది. బదిలీల్లో కోరుకున్న పాఠశాలలో ఖాళీలు లేకపోవడం, కోరుకున్న ప్లేస్‌లో ఇతరులకు ఉత్తర్వులు రావడం వంటివి జరిగాయి. దీంతో బాధిత టీచర్లు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. పొరపాట్లపై రాష్ట్ర ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 18లోగా పొరపాట్లను సరిదిద్దాలని, పరిష్కారం కాకపోతే రాష్ట్ర కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీ మునీర్, ఐటీసెల్ ఏపీఓ మంజునాథ్ తదితరులు పొరపాట్లను సరిదిద్దేందుకు కుస్తీ పడుతూ వచ్చారు. మూడురోజులుగా డీఈఓ ఆఫీసుకు వచ్చిన టీచర్ల సమస్యలు వింటూ, వారికి నచ్చచెబుతూ మరో స్థానం చూపుతూ వస్తున్నారు. పొరపాట్ల దిద్దుబాటుకు జిల్లా స్థాయిలో బుధవారం ఆఖరి రోజు కావడంతో బాధితులకు ఫోన్‌లు చేసి, కేటాయించిన ప్లేస్‌లను చెబుతూ బుజ్జగించారు. అయినా దాదాపు పదికి పైగానే సమస్యలు పరిష్కారం కాకపోవడంతో వాటిని రాష్ట్రశాఖకు పంపించినట్లు తెలిసింది.

నేటి నుంచి టీ20 క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నుంచి అనంతపురం క్రికెట్ స్టేడియంలో సౌత్‌జోన్ సీనియర్ టీ20 రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి తెలిపారు. జిల్లా సీనియర్ టీ20 జట్టుకు వినయ్‌కుమార్, గిరినాథ్‌రెడ్డి, అర్జున్‌టెండూల్కర్, దత్తారెడ్డి, రాజు కుళ్ళాయప్ప, మహేంద్రరెడ్డి, సంపత్‌కుమార్, సంతోష్, రోహిత్‌రోషన్, మల్లికార్జున, మహ్మద్‌కమిల్, దీపక్, మహబూబ్‌పీరా, ప్రదీప్‌రెడ్డి, వీరారెడ్డి, చైత్రవర్ధన్‌లు ఎంపికయ్యారు. స్టాండ్‌బైలుగా ప్రమోద్, ప్రశాంత్, భానుప్రకాష్, లోహిత్‌సాయి కిశోర్, వికాస్‌లు నిలిచారు. టీ20 టోర్నీలో అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు, నెల్లూరు ఐదు జట్లు పాల్గొంటాయన్నారు. గురువారం కడప-కర్నూలు, అనంతపురం-నెల్లూరు జట్ల మధ్య పోటీలు జరుగుతాయన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కదిరి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక జెండా వీధిలో నివాసముంటున్న షేక్ జిలానీ (39) విద్యుదాఘాతంతో బుధవారం మృతిచెందాడు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిలానీ బేల్దారి పని చేస్తుండేవాడు. బుధవారం మధ్యాహ్నం చౌక్ జంక్షన్ వద్ద కాలువ కనిపించకుండా ఇనుక కడ్డీలు అమర్చి, బండలు వేసే సమయంలో ప్రమాదవశాత్తు డ్రిల్లింగ్ మిషన్‌కు అమర్చిన వైరు తగిలి జిలానీ షాక్‌కు లోనయ్యాడు. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. దీనిపై జిలానీ భార్య ఫర్హానా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, శవాన్ని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు సీఐ వివరించారు.

గోరంట్లలో రైతు...

హిందూపురం(గోరంట్ల), జూన్ 18(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలంలోని కొత్తపల్లికి చెందిన రైతు నరేష్(40) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎప్పటిలాగే బుధవారం పొలం వద్దకు మోటారు ఆన్ చేయడానికి వెళ్లాడు. అయితే స్టార్టర్‌ను ముట్టుకోగానే విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరేష్ వ్యవసాయం చేస్తూ టీడీపీలో చురుగ్గా ఉండేవాడు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి, జూన్18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫాం వద్ద రైలు కింద పడి నంద్యాల జిల్లాకు చెందిన విశ్వేశ్వరరెడ్డి (29) బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం యర్రగుడి గ్రామానికి చెందిన దస్తగిరిరెడ్డి కుమారుడు విశ్వేశ్వరరెడ్డి కొంతకాలంగా వ్యసనాలకు బానిసయ్యాడు. క్రికెట్ బెట్టింగులు, ఆన్‌లైన్ జూదం ఆడి అప్పులపాలయ్యాడు. వాటిని తీర్చే మార్గంకానరాక మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే తాడిపత్రికి వచ్చి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ఉద్యోగం రాలేదని..

బుక్కరాయసముద్రం, జూన్18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం రాలేదని శివరాజ్ (21) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుక్కరాయసముద్రంలో జరిగింది. బుక్కరాయసముద్రం గ్రామానికి చెందిన సంగమేశ్ కూలి పని చేసుకుని జీవనం సాగించేవాడు. ఇతడి కుమారుడు శివరాజ్ (21) డిగ్రీ పూర్తి చేశాడు. రెండేళ్ల నుంచి పలుచోట్ల ఉద్యోగాల కోసం ప్రయత్నించినా ఎక్కడా ఉపాధి అవకాశాలు రాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

హిందూపురం/కళ్యాణదుర్గం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని దొడ్డబళ్లాపురం సమీపంలో రైలు ఢీకొని సురేంద్రనాయుడు(36) మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడిది కంబదూరు మండలం డీ చెన్నేపల్లి గ్రామం కాగా గత పదేళ్ల నుంచి హిందూపురం త్యాగరాజ్‌నగర్‌లో నివాసముంటున్నట్లు తెలిపారు. మంగళవారం రాత్రి రైల్వే ట్రాక్ దాటే సమయంలో గుర్తుతెలియని రైలు ఢీకొన్నట్లు తెలిపారు. ఈమేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

ద్విచక్రవాహనం నుంచి పడి వ్యక్తి మృతి


రమేష్ (ఫైల్)

బత్తలపల్లి, జూన్18(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంపెట్ల గ్రామ శివారులో బుధవారం ద్విచక్రవాహనం నుంచి జారిపడి రమేష్ (39) మృతిచెందాడు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దంపెట్ల గ్రామానికి చెందిన వెంకటస్వామి కుమారుడు రమేష్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. రమేష్‌ను అతడి అన్న వెంకటనారాయణ ద్విచక్రవాహనంలో కూర్చోబెట్టుకుని బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి బయల్దేరాడు. గ్రామ శివారులో వెనుక కూర్చున్న రమేష్ కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తమ్ముడు వెంకటగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన నాయకుల రాజీనామా


రాజీనామా పత్రాలను అందజేస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రజాసమాఖ్య (జీపీఎస్), గిరిజన విద్యార్థి సమాఖ్య (జీవీఎస్)ల ఉమ్మడి జిల్లా నాయకులు మూకుమ్మడి రాజీనామా చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన సమావేశంలో జీపీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, జాతీయ సలహాదారులు నారాయణస్వామి నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు నాయక్, రాయలసీమ యువజన అధ్యక్షుడు భాస్కర్‌నాయక్, హిందూపురం పార్లమెంట్ జీవీఎస్ అధ్యక్షుడు శీనానాయక్, అనంతపురం అధ్యక్షుడు రమేష్‌నాయక్, ఉపాధ్యక్షులు శివానాయక్, బాబు నాయక్, మహిళావిభాగం అధ్యక్షురాలు శోభాభాయి, కార్యదర్శి సుమతి తమ రాజీనామా పత్రాలను జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్‌నాయక్‌కు పంపినట్లు తెలిపారు. గత 20ఏళ్లుగా గిరిజనుల కోసం పనిచేశామని, అయితే స్వార్థ పరులైన నాయకుల వ్యవహారశైలి నచ్చకనే రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లాలో పూర్తి కమిటీలు రద్దు చేసినట్లు తెలిపారు. తమ నాయకుడు ఒక పార్టీకి అనుకూలంగా పనిచేస్తున్నారన్న అసంతృప్తితో రాజీనామా చేశామన్నారు.

ఏం పనులు చేశారో చెప్పండి..?

అధికారులను ప్రశ్నించిన కేంద్ర బృందం

ఉపాధి నిధులతో చేసిన పనులపై ఆరా


సోదనపల్లిలో లోతు దుక్కిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

అనంతపురం అర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి నిధులతో ఏఏ పనులు చేశారో చెప్పాలని డ్వామా, వ్యవసాయ, సంబంధిత శాఖల అధికారులను జాతీయ స్థాయి పర్యవేక్షణ కమిటీ బృందం సభ్యులు నవనీతదాస్, వెంకటేశ్వరన్ ప్రశ్నించారు. జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు బుధవారం స్థానిక డ్వామా సమావేశపు హాల్‌లో డ్వామా, వ్యవసాయ, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, ఐసీడీఎస్, మత్స్యశాఖ, భూగర్భజల శాఖ, అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సలీం బాషా జిల్లాలో ఉపాధి హామీ నిధులతో ఆయా శాఖల్లో చేపట్టిన పనులను కమిటీ సభ్యులకు వివరించారు. గురువారం నుంచి ఈనెల 21వతేదీ దాకా బృందం సభ్యులు ఎంపిక చేసిన ప్రాంతాల్లో పర్యటించి, ఉపాధి నిధులతో చేపట్టిన పనులను పరిశీలిస్తారన్నారు. యల్లనూరు మండలం చింతకాయమంద, మల్లాగుండ్ల గ్రామ పంచాయతీలు, అనంతపురం రూరల్, కందుకూరు పంచాయతీల్లో కమిటీ సభ్యులు పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయాప్రాంతాల్లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన పనులు, వాటి ప్రయోజనాలపై స్థానిక లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడతారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీటి నిల్వ పనులపై సంతృప్తి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాటర్ షెడ్ ద్వారా నీటిని నిల్వ చేసేందుకు చేపట్టిన పనులను జలశక్తి కేంద్ర బృందం సభ్యులు శంకర్, గౌతమ్ బుధవారం పరిశీలించారు. ఆయా పనుల కోసం ఖర్చు చేసిన నిధులపై ఆరా తీశారు. డ్వామా వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి బృందం సభ్యులకు వాటర్ షెడ్ ద్వారా నీటి నిల్వ చేసేందుకు చేపట్టిన పనులు, ఖర్చు చేసిన నిధుల వివరాలను వివరించారు. నీటి నిల్వ కోసం చేపట్టిన పనులపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత శింగనమల మండలం సోదనపల్లి, పెరవలి గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యకలాపాలను పరిశీలించారు. ఆ తర్వాత తాడిపత్రిలో మురుగునీటి శుద్ధి కర్మాగారాన్ని పరిశీలించి, వాటి నిర్వహణపై ఆరా తీశారు. అనంతరం తాడిపత్రిలోని ఆలూరులో చెక్ డ్యాంలు, మెషిన్ ఫాంపాండ్స్‌ను పరిశీలించారు. సాయంత్రం గార్లదిన్నె మండలంలో ఇంకుడు గుంతలు, ఫారంపాండ్స్, మిద్దెపై పడిన వర్షపు నీటిని సేకరించే పద్ధతిని పరిశీలించారు.

రెండోరోజు పర్యటన వివరాలిలా..

జలశక్తి కేంద్ర బృందం సభ్యులు గురువారం రెండోరోజు జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కూడేరు మండలంలోని పీఏబీఆర్ డ్యామ్‌ను పరిశీలిస్తారు. ఆ తర్వాత ఆత్మకూరు, కళ్యాణదుర్గం మండలాల్లో పర్యటిస్తారు. మధ్యాహ్నం రాయదుర్గం మండలంలో పలు రకాల పనులను పరిశీలిస్తారు.

జీవిత ఖైదీలకు స్వేచ్ఛ

ఉమ్మడి జిల్లాలో ఐదుగురి విడుదల


అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు నుంచి విడుదల అవుతున్న నలుగురు ఖైదీలతో జైలు అధికారులు


పెనుకొండ సబ్ జైలు నుంచి విడుదలైన సురేష్ బాబు

బుక్కరాయసముద్రం/పెనుకొండ టౌన్, జూన్ 17(ఆన్‌లైన్): రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఉమ్మడి జిల్లాలో ఐదుగురు జీవిత ఖైదీలు జైలు నుంచి బుధవారం విడుదలయ్యారు. అనంతపురం ఓపెన్‌ఎయిర్ జైలు నుంచి నలుగురు, పెనుకొండ సబ్ జైలు నుంచి ఒకరు క్షమాభిక్షపై బయటకు వచ్చారు. వీరిలో నలుగురు హత్య కేసులో, ఒకరు వరకట్నం కేసులో శిక్ష అనుభవించారు. అనంతపురం ఓపెన్ ఎయిర్ జైలు నుంచి విడుదల అయినవారిలో ప్రకాశం జిల్లా పొన్నలూరు మండలానికి చెందిన మద్దిరాల రాంబాబు(50), వైఎస్సార్ జిల్లా తొండూరు మండలం గొట్లూరు గ్రామానికి చెందిన దొంతిరెడ్డి పౌల్ రెడ్డి (54), కడప అర్బన్‌ను చెందిన షేక్ బాబా ఫక్రుద్దీన్ (51), పొట్టి శ్రీరాములు నెలూరు జిల్లా కేంద్రానికి చెందిన బండల చంద్ర (41) ఉన్నారని జైలు ఇన్‌చార్జి సూపరింటెండెంట్ షఫివుర్ రెహమాన్ తెలిపారు. పెనుకొండ సబ్ జైలు నుంచి జీవిత ఖైదు అనుభవిస్తున్న సురేష్ బాబు విడుదలయ్యారు. చెన్నైకి చెందిన సురేష్ బాబు వివాహం అనంతరం తిరుపతిలో ఉండేవారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్య మృతిచెందడంతో నమోదైన వరకట్నం కేసులో 17 ఏళ్లపాటు శిక్ష అనుభవించారు. ఇంటర్ చదువుతున్న తన కుమారుడు, కూతురు భవిష్యత్తు కోసం ఇక ఏదో ఒక పని కష్టపడి చేసుకుంటానని సురేష్ బాబు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైనా..? ఆఫ్‌లైనా..?

సచివాలయ సిబ్బంది బదిలీలపై సందిగ్ధత

ఎంపీడీఓల లాగిన్ నుంచి అప్‌లోడ్ కాని దరఖాస్తులు

కొరవడిన స్పష్టత

కార్యాలయాల చుట్టూ ఉద్యోగుల ప్రదక్షిణ

అనంతపురం న్యూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సచివాలయాల సిబ్బంది బదిలీలపై సందిగ్ధం నెలకొంది. ఆఫ్‌లైన్ నిర్వహిస్తారా..? ఆన్‌లైన్‌లో చేస్తారా అన్నదానిపై స్పష్టత కరువైంది. దీంతో సిబ్బంది అయోమయంలో పడ్డారు. ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా సర్వర్ పనిచేయట్లేదు. ఈనెల 16 నుంచి 18వతేదీ వరకు వివరాల నమోదుకు అవకాశం కల్పించారు. 22 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో బదిలీల అభ్యర్థనకు అవకాశం కల్పించారు. 25నుంచి 29వ తేదీ వరకు వాటిని పరిశీలించనున్నారు. 30న కలెక్టర్ బదిలీల ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు ఉత్తర్వులు వచ్చాయి. వివరాల నమోదుకు సర్వర్ ఓపెన్ కాకపోవడంతో ఉద్యోగులు అయోమయంలో పడ్డారు. సంబంధిత అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. కొన్ని విభాగాల్లో సంబంధిత అధికారులను సంప్రదించి బెర్త్ ఖరారు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. రిక్వెస్ట్ బదిలీలు మాత్రమే ఆన్‌లైన్‌లో చేస్తారనీ, ఐదేళ్లు పూర్తయిన వారికి ఆఫ్‌లైన్ ద్వారానే చేసే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

వైద్యశాఖలో బదిలీల సందడి

కొనసాగుతున్న కౌన్సెలింగ్


ఏఎన్ఎంల బదిలీలు చేపడుతున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో బదిలీల సందడి నెలకొంది. వైద్య కళాశాల, ప్రభుత్వ సర్వజనాస్పత్రి, జిల్లా వైద్యాధికారి కార్యాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంల నుంచి ప్రొఫెసర్ల వరకు స్థానచలనం కల్పిస్తున్నారు. ఇప్పటి వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 161 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారని అధికారులు తెలిపారు. 25 కేడర్లలో 500 మంది వరకు తప్పనిసరిగా బదిలీ కావాల్సిన లిస్టులో ఉన్నారు. మరో వందమంది వరకు రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకున్నారు. జూమ్ మీటింగ్ ద్వారా ఉద్యోగులు హాజరై, ఆప్షన్లు ఇచ్చుకుంటున్నారు. బదిలీల ప్రక్రియ శనివారం వరకు కొనసాగే అవకాశం ఉందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. బదిలీ అయిన వారికి ఈనెల 23లోపు ఉత్తర్వులు జారీ చేస్తారని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

లైబ్రేరియన్ పోస్టు ఖాళీ

వైద్య కళాశాలలోని కేంద్ర గ్రంథాలయ లైబ్రేరియన్ పోస్టు ఖాళీ పడనుంది. అక్కడ పనిచేస్తున్న రామేశ్వరి.. రిక్వెస్ట్ ట్రాన్స్‌ఫర్ పెట్టుకోవడంతో కర్నూలుకు బదిలీ అవకాశం కల్పించారు. లైబ్రేరియన్, అసిస్టెంట్ లైబ్రేరియన్‌తోపాటు నలుగురు సహాయక ఉద్యోగులు సెంట్రల్ లైబ్రరీలో పనిచేస్తున్నారు. లైబ్రేరియన్ మినహా అందరూ ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. రామేశ్వరి బదిలీతో సెంట్రల్ లైబ్రరీలో రెగ్యులర్ ఉద్యోగులు ఉండరని కళాశాల అధికారులు పేర్కొన్నారు.

కేడర్ల వారీగా బదిలీలు ఇలా..

కేడర్	బదిలీ అయినవారి సంఖ్య
ప్రొఫెసర్లు	2
అసోసియేట్ ప్రొఫెసర్లు	6
ల్యాబ్ టెక్నీషియన్లు	12
జూనియర్ అసిస్టెంట్లు	7
ఎల్‌డీ, కంప్యూటర్స్	8
టైపిస్టులు	4
ఏఎన్ఎం	122
మొత్తం	161

కొందరు లక్కీ..

నిబంధనలకు మేరకు కాలపరిమితి పూర్తయినవారు తప్పనిసరిగా బదిలీ కావాల్సిందేనని రాష్ట్ర వైద్య శాఖ ఆదేశాలు జారీచేసింది. ఆ మేరకు వివరాలు క్రోడీకరించి ఉద్యోగులను అధికారులు బదిలీ చేస్తున్నారు. మెడికల్ గ్రౌండ్స్, ఎంప్లాయిస్ అసోసియేషన్, స్పౌజ్ తదితర వెసులుబాటు ఉన్న వారిని ప్రస్తుత స్థానంలో కొనసాగిస్తున్నారు. బదిలీ అవ్వాల్సిన కొంతమంది ఉద్యోగులకు అదృష్టం వరించినట్లుంది. ప్రస్తుత స్థానం నుంచి బదిలీ కావాలంటే క్లియర్ వెకేన్సీలు, పోస్టింగులు ఎక్కడా దొరకడంలేదు. దీంతో వారందరూ ప్రస్తుత స్థానంలోనే కొనసాగుతారని అధికారులు పేర్కొంటున్నారు.

అర్ధాంతరంగా బదిలీల నిలుపుదల

వైద్యశాఖ ఆర్డీ రామగిడ్డయ్య

అనంతపురం వైద్యం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖలో చేపట్టిన బదిలీల ప్రక్రియను అర్ధాంతరంగా నిలుపుదల చేస్తున్నట్లు రీజనల్ డైరెక్టర్(ఆర్డీ) రామగిడ్డయ్య బుధవారం తెలిపారు. హంస సిఫార్సులను బదిలీల్లో పరిగణనలోకి తీసుకోకూడదంటూ ఇతర సంఘాల నాయకులు.. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖకు ఫిర్యాదు చేశారన్నారు. దీంతో హంస తాత్కాలిక గుర్తింపును నిలుపుదల చేశారన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత బదిలీల్లో హంస కార్యవర్గంలోని ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వలేదన్నారు. తమకు న్యాయం చేయాలని హంస కార్యవర్గం న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో గుర్తింపును కొనసాగిస్తూ ఉత్తర్వులిచ్చిందన్నారు. ఆ మేరకు మినహాయింపునిచ్చేలా బుధవారం నిర్వహించిన అన్ని కేడర్ల బదిలీలను పునఃపరిశీలిస్తామన్నారు. గురువారం నుంచి చేపట్టే బదిలీల్లో మినహాయింపును వర్తింపజేస్తామని తెలిపారు. కోర్టు తీర్పుపై హంస నాయకులు షఫీ, వేణుగోపాల్, రాఘవేంద్రరెడ్డి, అనిల్‌నాయక్, నల్లప్ప, విజయప్రసాద్ హర్షం వ్యక్తంచేశారు.

ఉన్నత పాఠశాలలో చోరీకి యత్నం

సైకిళ్లు ఉంచిన గది తాళాలను పగులగొట్టిన దుండగులు

చెన్నేకొత్తపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సైకిళ్ల చోరీకి గురుతెలియని దుండగులు యత్నించారు. ఉన్నత పాఠశాలలోకి మంగళవారం రాత్రి కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి, సైకిళ్లు ఉంచిన గది తాళాలను పగులగొట్టారు. అందులోని ఓ సైకిల్‌ను బయటకు తీసుకొచ్చి ప్రార్థనా ప్రాంగణం వద్ద పడేసి వెళ్లారు. మొత్తం 155 సైకిళ్లు ఉండగా.. ఒక్కటి కూడా ఎత్తుకెళ్లలేదు. ఎస్ఐ సత్యనారాయణ పాఠశాలను పరిశీలించి, హెచ్ఎం ఓబుళమ్మను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఇది ఆకతాయిల పనా, దొంగలే ప్రయత్నించి ఉంటారా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.


తరగతి గది గ్రిల్ తాళాలను పగులగొట్టిన దృశ్యం

హృషికేశ్‌కు ప్రత్యేక రైలు

గుంతకల్లు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని నియంత్రించడానికి యశ్వంతపూర్-యోగ్ నగరి హృషికేశ్‌కు అప్ అండ్ డౌన్ సింగిల్ ట్రిప్ ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. యశ్వంతపూర్-హృషికేశ్ (06597) ప్రత్యేక రైలు ఈ నెల 19న (గురువారం) యశ్వంతపూర్‌లో ఉదయం 7 గంటలకు బయలుదేరి 21 ఉదయం 10-20 గంటలకు హృరిషికేశ్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు ప్రత్యేక రైలు (06598) హృషికేశ్‌లో 21 సాయంత్రం 5-55 గంటలకు బయలుదేరి 23 సాయత్రం 7-45 గంటలకు యశ్వంతపూర్‌కు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూల్ సిటీ, కాచిగూడ, ఖాజీపేట్, బాలార్షా, నాగపూర్, భోపాల్, బీనా, వీరాంగన లక్ష్మీబాయ్ ఝాన్సీ, గ్వాలియర్, ఆగ్రా కంటోన్మెంటు, మధుర, హజ్రత్ నిజాముద్దీన్, ఘజియాబాద్, మీరట్ సిటీ, ముజఫ్ఫర్‌నగర్, తాప్రి, రూర్కీ, హరిద్వార్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

జడ్పీ సీఈఓ శివశంకర్ బాధ్యతల స్వీకరణ

అనంతపురం న్యూటౌన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సీఈఓగా శివశంకర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీఈఓగా పనిచేస్తున్న రామచంద్రారెడ్డిని సరండర్ చేశారు. దీంతో డ్వామాలో ధర్మవరం ఏపీడీగా పనిచేస్తున్న శివశంకర్‌ను జడ్పీ సీఈఓగా నియమించారు. ఆయన జడ్పీ కార్యాలయంలోని సీఈఓ చాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు. మంగళవారం సాయంత్రమే కలెక్టర్ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను కలిశారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

27 నుంచి గూగూడు బ్రహ్మోత్సవాలు

నార్పల, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 27 నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ ఈఓ శోభ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 27న స్వామి వారి ప్రథమ దర్శనం, 28న స్వామి వారి నిత్యపూజ నివేదన, 29న స్వామి వారి అగ్నిగుండము ఏర్పాటు చేయుట, స్వామి వారిని నిలుపుట, జూలై 1న స్వామి వారి నిత్యపూజ నివేదన, 2న స్వామి వారి చిన్నసరిగెత్తు, 3న స్వామి నిత్యపూజ నివేదన, 4న స్వామి వారి ఏడో చిన్నసరిగెత్తు, రాత్రికి దేవుని మెరవణి, 5న నిత్యపూజ నివేదన విడిదినము, 6న స్వామి వారి గ్రామోత్సవం, పెద్దసరిగెత్తు రాత్రికి దేవుడి మెరవణి, అగ్నిగుండం ప్రవేశం, 7న అగ్నిగుండ ప్రవేశం, జలధి కార్యక్రమం, 9న స్వామి వారి చివరి దర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈఓ తెలిపారు.

చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురంరూరల్, జూన్18(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.30వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.2,500, సరాసరి రూ.17వేలతో అమ్ముడుపోయాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 494టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తచెరువు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ సత్యసాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న బయాలజీ, ఎకనామిక్స్ లెక్చరర్ పోస్టులకు దరకాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతిర్లత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కల్గిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలలో సంప్రదించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎంపిక చేస్తామన్నారు.

జిల్లా మేదర సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు


సమావేశంలో పాల్గొన్న నాయకులు

అనంతపురం క్లాక్ టవర్, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా మేదర సంఘం అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. స్థానిక మల్లాలమ్మ ఆలయంలో జిల్లా మేదరసంఘం కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ రంగయ్య, ఎలక్షన్ ఆఫీసర్ వీరభద్రయ్య, మేదర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్ర, గౌరవాధ్యక్షులు వేణుగోపాల్, కేఎం వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్‌ల సమక్షంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా మేదర సంఘం అధ్యక్షుడుగా పోలేపల్లి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అశోక్‌కుమార్, కోశాధికారిగా వెంకటరాముడు, ప్రచార కార్యదర్శిగా పోతుల రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఏడాదిలో పదో తరగతిలో 500 మార్కులు, ఇంటర్‌లో 900మార్కులపైన వచ్చిన మేదర విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని కార్యవర్గ సభ్యులు తెలిపారు. పేద మేదర విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, ఇతర విద్యాసామగ్రి పంపిణీ చేస్తామని అన్నారు. మేదరలను ఎస్టీలుగా గుర్తించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

న్యూస్ బాక్స్

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి


ఎక్సైజ్ సీఐతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ధర్మవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి అందరూ కృషిచేయాలని అనంతపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. బుధవారం ధర్మవరం కార్యాలయాన్ని ఆయనతోపాటు అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీరామ్ తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న సారా కేసులోని నిందితులను త్వరగా అరెస్టు చేయాలని సీఐ చంద్రమణిని ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వివిధ సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి కృషిచేయాలన్నారు. ఎమ్మార్పీలకే మద్యం అమ్మేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ ఎస్ఐలు చాంద్‌బాషా, నాగరాజు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత


యోగా చేస్తున్న విద్యార్థులు

ధర్మవరం, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఏకాగ్రత, మానసిక ప్రశాంతత కలుగుతాయని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా గౌరవ సలహాదారుడు అన్నం అరవింద్ పేర్కొన్నారు. స్థానిక లయోలా పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులచేత యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శంకర్‌నాయుడు, జిల్లా సామాజిక సమరసత వేదిక కన్వీనర్ గడ్డం వాసుదేవయ్య పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న హరీశ్‌బాబు

ధర్మవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో బీటీరోడ్డు నిర్మాణానికి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి బుధవారం భూమి పూజచేశారు. ఆసుపత్రికి రోజూ వందలాది మందిరోగులు వస్తున్నారని, రోడ్డు దయనీయస్థితిలో ఉండడంతో మంత్రి సత్యకుమార్‌యాదవ్ నిధులు మంజూరు చేయించారన్నారు.

22, 23 తేదీల్లో మంత్రి పాదయాత్ర

ప్రతిగడపకు ప్రభుత్వం.. ప్రతి వ్యక్తికి అభివృద్ధి అనే లక్ష్యంతో రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈనెల 22, 23 తేదీలలో పట్టణంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో బుధవారం బీజేపీనాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు.

నేడు మలమీదపల్లిలో 'మన ఇంటికి మన ఎమ్మెల్యే'

గాండ్లపెంట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలమీదపల్లి పంచాయతీలో గురువారం మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ కొండయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ కార్యక్రమానికి హాజరవుతారన్నారు. 9 గంటలకు కరణంవారిపల్లి, కుమ్మరవాండ్లపల్లి, అరమడకవారిపల్లి, ఎస్సీకాలనీ, మల్లమీదపల్లి, మధ్యాహ్నం 3.30 నుంచి సామనచేనుబైలు, నల్లసానివారిపల్లి, ఎస్సీ కాలనీ, పత్రవాండ్లపల్లిలో ఇంటింటికి వచ్చి ఎమ్మెల్యే ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటారని అన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

బత్తలపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శివయ్య తెలిపారు. బుధవారం ఏఈ విలేకరులతో మాట్లాడుతూ.. బత్తలపల్లిలో గురువారం పాతవూరు, ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఇదిరమ్మ కాలనీ, జగనన్న కాలనీ, ఆర్డీటీ ఆసుపత్రి, తాడిపత్రి, కదిరి, ధర్మవరం రోడ్లలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేస్తున్నందున ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌గా రాణాప్రతాప్ నాయక్

పుట్టపర్తి రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగరాజుపల్లి ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్‌గా రాణాప్రతాప్‌నాయక్‌ను నియమిస్తూ బుధవారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన నల్లచెరువు ఆదర్శపాఠశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న రమేష్‌బాబు హిందూపురం ఆదర్శపాఠశాలకు బదిలీపై వెళ్లారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపండి

పుట్టపర్తి రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరా లు నిండిన పిల్లలందరిని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సీడీపీఓ జయంతి సూచించారు. బుధవారం ఎనములపల్లి-1 అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఆమె గ్రామస్థులతో మాట్లాడుతూ కేంద్రాల్లో నాణ్యమైన విద్యతో పాటు పోషక విలువలతో కూడిన భోజనం, గుడ్లు, పాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సుజాత, రజిత, కార్యకర్తలు పాల్గొన్నారు.

నోటుపుస్తకాల పంపిణీ

నంబులపూలకుంట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కొత్తపల్లి, ఎగువతూపల్లి ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు బుధవారం నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన చిన్నకోట్ల మనోహర్ తండ్రి మాజీ సర్పంచ్ సూర్యనారాయణ జ్ఞాపకార్థం విద్యార్థులకు నోటుపుస్తకాలు,పెన్నులు ప్రతియేటా పంపిణీ చేస్తారు. ఈసారి కూడా రెండు గ్రామాల్లో 70 మంది విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందించారు. కార్యక్రమంలో మనోహర్, వేణుగోపాల్‌క్రిష్ణ, మోహిత్‌వదన్, మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు, ప్రధానోపాధ్యాయులు రవీంద్ర, ధనుంజయరెడ్డి, ఉపాధ్యాయులు రఘునాథ్ పాల్గొన్నారు.


పి.కొత్తపల్లిలో నోటుపుస్తకాలను పంపిణీ చేస్తున్న దాతలు

పిచ్చిమొక్కలతో నిండిన పాలిటెక్నిక్ కళాశాల

● చుట్టూ అపరిశుభ్రత ● పట్టించుకోని అధికారులు ● విషపురుగులు సంచరిస్తున్నాయని తల్లిదండ్రుల ఆందోళన


కళాశాల చుట్టూ భవనాల వరకు పెరిగిన పిచ్చిమొక్కలు

ధర్మవరంరూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామాపురం వద్ద ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల చుట్టూ ఆవరణమంతా పిచ్చిమొక్కలతో అపరిశుభ్రత నెలకొంది. కళాశాల ముందు, వెనుకభాగాన పిచ్చిమొక్కలతో నిండిపోయింది. నూతన విద్యార్థులకు పిచ్చిమొక్కలతో కళాశాల స్వాగతం పలికేలా ఉంది. ఈ పిచ్చిమొక్కల్లో పాములు, పురుగులు సంచరిస్తున్నాయని చుట్టుపక్కల ఉంటున్న స్థానికులు చెబుతున్నారు. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కళాశాల అద్దాలు కూడా పగిలిపోయి అసౌకర్యంగా ఉన్నాయి. శాస్త్ర, సాంకేతిక విద్యను అభ్యసించే కళాశాలలో ఇలా ఉండడంపై విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాడుబడిన భవనాల మాదిరిగా ఉన్నా కళాశాల పరిశుభ్రతపై అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నట్లు కనిపిస్తోంది. స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రభుత్వం పరిశుభ్రత పై ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా ఇక్కడ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ప్రిన్సిపాల్, అధ్యాపకులు స్పందించి కళాశాల చుట్టూ అవరణంలో పిచ్చిమొక్కలు తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రీసర్వేతో పేదలకు ప్రభుత్వ పథకాలు దూరం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

బత్తలపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూములు రీసర్వే చేస్తున్న సర్వేయర్లు ఉమ్మడి ఖాతా నెంబర్లు ఇచ్చి పేద ప్రజలకు ప్రభుత్వ పథకాలను దూరం చేస్తున్నారని దంపెట్ల సర్పంచ్ కరుణాకర్ నాయుడు మండిపడారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ త్రివేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధికారులు ఆయా శాఖల గురించి వివరించారు. దంపెట్ల సర్పంచ్ కరుణాకర్‌నాయుడు మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు రీసర్వేలో రైతుల అందరికి ఒకే ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) నెంబర్ ఇస్తున్నారని అన్నారు. దీంతో ఆ ఎల్‌పీఎంలో ఉన్న రైతులకు ఆ సర్వే నెంబర్‌లో ఉన్న భూమి 50లేదా 100 ఎకరాలు చూపిస్తోందని, దీంతో పేదలు తల్లికివందనం, అన్నదాతా సుఖీభవ వంటి పథకాలు కోల్పోతున్నరని మండిపడ్డారు. రీసర్వే చేసే విలేజ్ సర్వేయర్లు గ్రామాల్లో వివాదాలు సృష్టించి సెటిల్‌మెంట్లు చేస్తున్నారన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీడీఓ నరసింహనాయుడు కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ కిష్టప్ప, ఏఈ శివయ్య, పశువైద్యాధికారి గురునాథ్‌రెడ్డి, ఏఓ ఓబిరెడ్డి, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం హరిప్రసాద్ పాల్గొన్నారు.

లారీకి తగిలిన వైరు..

తప్పిన పెను ప్రమాదం



కొత్తచెరువు నాలుగురోడ్ల కూడలిలో లారీ

కొత్తచెరువు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొత్తచెరువులో అక్రమ నిర్మాణాలతో రోడ్లు కుంచించుకుపోయాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బుధవారం ధర్మవరం వైపు నుంచి సిమెంటును నిల్వఉంచే(సైలో ట్యాంక్) వేసుకొని లారీ బుక్కపట్నం వైపు పోవాల్సి ఉంది. రోడ్డు వెడల్పు లేక పోవడంతో లారీ ఇరుక్కుపోయింది. దీంతో నెహ్రూకూడలిలో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయింది. బుక్కపట్నం రోడ్డులో లారీలోని ట్యాంక్‌కు విద్యుత్ వైర్లు తగలడంతో తెగి కిందపడ్డాయి. ఆ సమయంలో రాకపోకలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో మండల కేంద్రానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ వైర్లను ఎత్తు పెంచాలని విద్యుత్‌శాఖ అధికారులకు పలుమార్లు తెలిపినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న పీఈటీ షఫీ

నల్లచెరువు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పూలకుంట రోడ్డులో బుధవారం క్రికెట్ టోర్నీని పీఈటీ షఫీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు డీవీ పవన్‌కుమార్, రాజేష్‌నాయుడు మాట్లాడుతూ ఎన్‌పీఎల్ టోర్నమెంట్‌లో 24 జట్లు పాల్గొన్నాయని, గెలుపొందిన జట్టుకు రూ.20,116, కప్పు, రన్నర్‌కు రూ.10,116, కప్పు అందచేస్తామన్నారు. క్రికెట్ వారంరోజులపాటు జరుగుతుందని వివరించారు.

ధర్మవరం తహసీల్దార్‌గా సురేష్‌బాబు



ధర్మవరం రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ధర్మవరం తహసీల్దార్‌గా పీఎల్ సురేష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా ఉన్న నటరాజ చిలమత్తూరు మండలానికి బదిలీ అయ్యారు. ధర్మవరం డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న సురేష్‌బాబును తహసీల్దార్‌గా నియమించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న ప్రహ్లాదరెడ్డి

నల్లచెరువు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బసవన్నకట్ట సమీపంలోని పురాతన రామాలయం పునఃనిర్మాణానికి కనిమిరెడ్డి ప్రహ్లాదరెడ్డి అనే భక్తుడు రూ.50వేలు బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆయల కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆయల పునఃనిర్మాణానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో నగేష్, దశరథనాయుడు, రామాంజనేయులు, బాబు, రెడ్డెప్ప పాల్గొన్నారు.

గ్రామ కమిటీల పరిశీలన


మసకవంకపల్లిలో మాట్లాడుతున్న రొద్దం నరసింహులు

నల్లమాడ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ నాయకులు గతంలో ఎంపిక చేసిన గ్రామ, మండల కమిటీలను బుధవారం మండల పరిశీలకుడు రొద్దం నరసింహులు ఆయా గ్రామాలకు వెళ్లి కమిటీలను పరిశీలించారు. నల్లమాడ, రెడ్డిపల్లి, ఎర్రవంకపల్లి, మసకవంకపల్లి, కురమాల పంచాయతీల్లో కమిటీలను పరిశీలించి, ఆయా గ్రామ పంచాయతీలో నాయకులతో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మైలే శివశంకర్, నాయకులు కోట్లో మంజునాథ్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బుక్కపట్నం: గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు టీడీపీని మరింత బలోపేతం చేయడానికి పార్టీ సంస్థాగత కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు బుక్కపట్నం మండల టీడీపీ పరిశీలకుడు పోతులయ్య పేర్కొన్నారు. బుధవారం పార్టీ సంస్థాగత ఏర్పాటు గురించి టీడీపీ బూత్‌కన్వీనర్లు, నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో మిగిలిన ఐదు బూత్ కన్వీనర్లను రెండు రోజుల్లో ఎంపిక చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్, లావణ్యగౌడ్ పాల్గొన్నారు.


'తల్లికి వందనం'పై సంబరాలు


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న విద్యార్థులు

నంబులపూలకుంట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువతూపల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం తల్లికివందనం సంబరాలు జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములనాయుడు, ప్రధానోపాధ్యాయులు ధనుంజయరెడ్డి, రఘునాథ్, రామచంద్రారెడ్డి, వేమయ్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● తాడిమర్రి : ప్రభుత్వం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడంతో మండల టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనర్హుల జాబితాలో ఉన్న వారి వివరాలను పూర్తి స్థాయిలో పరిశీలించి అర్హులైన వారికి రెండో జాబితాలో వచ్చేలా చూడాలని అధికారులను కోరుతున్నామన్నారు.

ఎన్నికల పరిశీలకుడిగా బోరు రమణ



ఓబుళదేవరచెరువు, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): శింగనమల, కదిరి నియోజకవర్గాల టీడీపీ ఎన్నిలక పరిశీలకుడిగా మండలంలోని గౌరాపురం గ్రామానికి చెందిన బోరు రమణను నియమించారు. ఈ మేరకు బుధవారం టీడీపీ ప్రధాన కార్యాలయం నుంచి తనకు ఉత్తర్వులు అందినట్లు చెప్పారు. పరిశీలకులుగా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

26న మండల సర్వసభ్య సమావేశం

నల్లమాడ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 26న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యులు హాజరుకావాలన్నారు. ఎన్నికయినవారు మాత్రమే హాజరుకావాలని, ఇతరులు హాజరుకాకూడదని చెప్పారు.

'తల్లికి వందనం'పై రభస

మండల సమావేశంలో సర్పంచ్‌ల వాగ్వాదం


సర్వసభ్య సమావేశంలో వాగ్వాదం చేసుకుంటున్న సర్పంచ్‌లు

తాడిమర్రి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తల్లికివందనం పథకం అనర్హుల జాబితాపై మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు వాగ్వాదానికి దిగారు. ఎంపీపీ భువనేశ్వరరెడ్డి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారిగా అధికారులు నివేదికలు చదివి వినిపించారు. రెవెన్యూ అధికారులు చేసిన తప్పుల మూలంగానే తల్లికివందనం పథకం అనర్హుల జాబితాలో ఎక్కువగా ఉండిపోయారని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ , టీడీపీ సర్పంచులు పేర్కొన్నారు. దీనిపై రామాపురం సర్పంచ్ పుల్లయ్య, పిన్నదరి ఎంపీటీసీ చంద్రబాబు ఎన్ని రోజులు ఇలా అనర్హుల జాబితా గురించి మాట్లాడతారని ఎద్దేవా చేశారు. దీంతో టీడీపీ సర్పంచులు గత ప్రభుత్వం భూముల రీసర్వేలో చేసిన తప్పిదాల వల్లే ఇప్పటికీ తప్పులు దొర్లుతున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగారావు, ఈఓఆర్డీ విజయశేఖర్, వైస్‌ఎంపీపీ కృష్ణమనాయుడు, ఎంఈఓ కృష్ణమోహన్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.మండల సర్వసభ్య సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సి ఉండగా విద్యుత్‌శాఖ నుంచి ఎవరూ రాలేదు. ఈ విషయంపై ఎంపీడీఓ రంగారావు మాట్లాడుతూ.. సమావేశానికి హాజరు కానీ అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేస్తున్నట్టు తెలిపారు.

టీడీపీతోనే ప్రజలు మెచ్చే పాలన: ఎమ్మెల్యే


బియ్యం ప్యాకెట్ పంపిణీ చేస్తున్నఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరిఅర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రజలు మెచ్చే పాలన టీడీపీతోనే సాధ్యమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా టీడీపీ రూరల్ నాయకులు ఓరాతి చంద్ర, పీఆర్ గణేష్ ఆధ్వర్యంలో బుధవారం పీవీఆర్‌గ్రాండ్‌లో 50 కుటుంబాల పేదలకు 50 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల అభివృద్ధిని కోరుకునే చంద్రబాబు నాయకత్వంలో తాము పనిచేయడం గర్వంగా ఉందన్నారు. సొంత నిధులతో పేదలకు బియ్యం పంపిణీ చేసిన నాయకులను అభినందించారు. కార్యక్రమంలో కదిరి, నల్లచెరువు కన్వీనర్లు చెన్నకేశవులు, రాజశేఖర్‌బాబు, నాయకులు మనోహర్, జయచంద్ర, ఆదిరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శ్రీకాంత్‌నాయక్, జయచంద్ర పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న చీఫ్ మేనేజర్ హరిప్రసాద్

కదిరిఅర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వార్షికోత్సవం సందర్భంగా కదిరి మెయిన్ బ్రాంచ్ ఆవరణంలో బుధవరం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించినట్లు చీఫ్ మేనేజర్ హరిప్రసాద్ తెలిపారు. బ్యాంకు సేవలతోపాటు అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 80మంది దాతలు రక్తం ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్లు వెంకటేష్, కుమార్, సుజిత, శశిధర్, సిబ్బంది ఇసాక్‌నాయక్, బ్యాంక్ వ్యాల్యుయర్ కొమ్ము విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి


ఏఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ధర్మవరం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడీ అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజన్‌కుబ్రాకు బుధవారం వినతిపత్రం అందజేశారు.పట్టణంలోని ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు ఏ మాత్రం పాటించలేదని తెలిపారు. నోటీసు బోర్డులలో ఫీజుల పట్టిక, ఉపాధ్యాయుల అర్హతల వివరాలు ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీనాథ్, అమన్‌బాలాజీ, చిన్ను పాల్గొన్నారు.

పారదర్శకంగా కమిటీలు ఏర్పాటు చేయాలి

తాడిమర్రి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సంస్థాగత కమిటీల ఎంపికను పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు, మండల ఎన్నికల పరిశీలకురాలు సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...పార్టీ గెలుపు కోసం పనిచేసిన వారందరికి కమిటీలో సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కూచి రాము, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, నాయకులు విశ్వనాథ్, జనార్దన్, హర్ష, భాస్కర్‌గౌడ్, శ్రీనివాసులు, పక్కీర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశం

నంబులపూలకుంట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటరమణ గురువారం మండలానికి రానున్నట్లు మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల కేంద్రంలోని మల్లికార్జునస్వామి కమ్యూనిటీ భవనంలో సమావేశం ఉంటుందన్నారు. ఇటీవల మండల, గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేశామని, వారికి సూచలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని క్లస్టర్, యూనిట్, మండల ఇన్‌చార్జిలు, కోశాధికారులు, గ్రామ కమిటీలు, పార్టీ ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

కదిరిఅర్బన్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న వృద్ధాశ్రమంలో బుధవారం క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. రెండువారాలకు మించి దగ్గు, సాయంత్రం పూట జ్వరం వస్తుంటే ప్రభుత్వ ఆసుపత్రిలో గల్ల పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణకోసం ఆసుప్రతిలో చికిత్సలు అందుబాటులో ఉన్నాయన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పద్మావతి, ఆశాజ్యోతి పాల్గొన్నారు.

నేటి నుంచి అక్రమ కట్టడాల తొలగింపు

కొత్తచెరువు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొత్తచెరువు నాలుగురోడ్ల కూడలిలోని ఆర్‌అండ్‌బీ రహదారుల్లో నిర్మించిన అక్రమకట్టడాలను గురువారం నుంచి తొలగిస్తామని ఆర్‌అండ్‌బీ జేఈ వన్నూరుస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమ నిర్మణాలు తొలగించుకోవాలని ఇప్పటికే 125 మందికి నోటీసులు జారీచేశామని పేర్కొన్నారు. కొంతమంది ముందు ఉన్న రేకులను తొలగించుకున్నారేతప్పా, తాము వేసిన మార్కింగ్ ప్రకారం తొలగించుకోలేదన్నారు. కలెక్టర్, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తుతో గురువారం నుంచి ఎక్స్‌కవేటర్లతో అక్రమ నిర్మణాలను తొలగిస్తామని తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయండి

నంబులపూలకుంట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జగన్మోహన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని శివాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలు డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేపటుడుతున్నామన్నారు. అనంతరం సీఐటీయూ మండల కమిటీని ఎంపిక చేశారు. కన్వీనర్‌గా నాగరాజు, కోకన్వీనర్ బాబాజీ, దర్బార్‌రెడ్డి, కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో గంగిరెడ్డి, మల్లిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



ఓబుళదేవరచెరువు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మామిళ్లకుంటపల్లి క్రాస్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కదిరి రూరల్ మండలలోని సున్నపుగుట్టతండాకు చెందిన బాషా తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం ద్విచక్ర వాహనంలో అతడు కదిరివైపు వెళ్తూ,మామిళ్లకుంటపల్లి క్రాస్ వద్ద పోలీసులు ట్రాఫిక్ కోసం ఉంచి డివైడర్‌కు ఢీకొని కిందపడ్డాడు. వెంటనే స్థానికులు ఓడీసీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం కదిరి వైద్యశాలకు తరలించారు.

ఆగిన గ్రానైట్ లారీ


గ్రానైట్‌ను తరలిస్తున్న లారీ

నంబులపూలకుంట, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనియాన్ చెరువు సమీపంలో కదిరి-రాయచోటి ప్రధాన రహదారిపై మంగళవా రం రాత్రి గ్రానైట్ లారీ ఆగిపోయింది. బుధవారం తెల్లవారు జామున ధనియాన్‌చెరువు గ్రామస్థులు తహసీల్దార్ దేవేంద్రనాయక్‌కు సమాచారం అందించారు. రెవెన్యూ సిబ్బందిని ఆ ప్రాంతానికి పంపారు. అనుమతులున్నాయా అన్న విషయాలు తెలుసుకున్నారు. బుధవారం సాయంత్రం అక్కడి నుంచి లారీ తరలి వెళ్లిపోయింది.

శిథిలావస్థలో ఎమ్మార్సీ



శిథిలావస్థకు చేరుకున్న ఎమార్సీ భవనం

అగళి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో మరమ్మతులు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. 23ఏళ్ల క్రితం నిర్మించిన భవనం నేటికి శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే జలమయంగా మారుతోంది. దీంతో కార్యాలయంలో ఉన్న ఫర్నిచర్, కంప్యూటర్లు తడిసిపోతున్నాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకుమరమ్మతులు చేపట్టలేదని అంటున్నారు. కిటికీలకు అమర్చిన షెల్ఫులు కూడా పడిపోయాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎమ్మార్సీ కార్యాలయానికి మరమ్మతులు చేయాలని లేనిపక్షంలో నూతన భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

పథకాలు అర్హులకు అందించాలి

ఎంఈఓ నాగరాజునాయక్

లేపాక్షి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ నాగరాజునాయక్ అన్నారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం, మధ్యాహ్న భోజన పథకాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా చూడాలన్నారు. విద్యార్థులు యోగాలో తప్పనిసరిగా పాల్గొనేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మైదుగోళం, తిలక్‌నగర్ గ్రామాల్లో రెండు ఉన్నత పాఠశాలలు ఈ యేడాది నూతనంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో ఈ గ్రామాల్లో 8వ తరగతి మాత్రమే తరగతులు నిర్వహిస్తుండేవారని ప్రస్తుతం 10వ తరగతి వరకు చదువుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 కుళ్లాయప్ప, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

మడకశిర రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదు రోజులుగా విద్యుత్ కోతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మూడు గంటలు కూడా సరిగా విద్యుత్ సరఫరా ఉండకపోవడంతో ఇబ్బందులుపడుతున్నట్లు చెబుతున్నారు. వ్యాపారుల పరిస్థితి దయనీయంగా మారింది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని విద్యుత్ సరఫరా మెరుగయ్యేవిధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై విద్యుత్ ఏడీ రఘును వివరణ కోరగా విద్యుత్ లైన్‌కు తగులుతున్న చెట్లును తొలగిస్తున్నారని, అందుకోసం విద్యుత్ సమస్య ఏర్పడిందన్నారు. రెండు రోజులో సమస్య పరిష్కారమవుతుందని వివరించారు.

'యోగాంధ్ర'ను విజయవంతం చేద్దాం

-కలెక్టర్ చేతన్


వీసీలో పాల్గొన్న అధికారులు

పెనుకొండ, జూన్ 18 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాలు అన్నిశాఖలు సమన్వయంతో విజయవంతం చేద్దామని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. బుధవారం యోగా దినోత్సవ నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యోగా కార్యక్రమాల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కమిషనర్ సతీష్‌కుమార్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ కృష్ణ, సీడీపీఓ భాగ్యలక్ష్మి, వెలుగు ఏపీఎం రవిచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహించరాదంటూ తీర్మానం

హిందూపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లిలో బెల్ట్ షాపులు నిర్వహించరాదంటూ గ్రామపెద్దలు సమావేశమై తీర్మానించారు. చౌడేశ్వరి కల్యాణమండపం వద్ద బుధవారం సమావేశమైన గ్రామపెద్దలు మాట్లాడుతూ ముద్దిరెడ్డిపల్లి ఆలయం సమీపంలో బెల్ట్‌షాపులు పెట్టడంవల్ల మద్యం సేవించి గొడవలు జరుగుతున్నాయన్నారు. వీటిని తొలగించాలన్నారు. నాలుగురోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. వెంటనే బెల్ట్‌షాపుల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటోలో మైక్‌పెట్టుకుని బెల్ట్‌షాపు నిర్వహించరాదంటూ ముద్దిరెడ్డిపల్లిలో అనౌన్స్‌మెంట్ చేశారు. అయితే ఈ సమావేశం నిర్వహించడానికి తెలుగుదేశం పార్టీ నాయకులే ముందుండి నడిపించడంపై అధికార పార్టీలో మరోవర్గం నాయకులు గుర్రుగా ఉన్నారు. ఏదైనా ఉంటే అధికారుల వద్ద, ఎమ్మెల్యే కార్యాలయంలో చెప్పుకుండా ఏకంగా సమావేశం నిర్వహించడం ఏంటని తెలుగుదేశం పార్టీలోని మరో వర్గం నాయకులు బహిరంగంగా అంటున్నారు.

జీతాలు చెల్లించండి: ఏఐటీయూసీ

హిందూపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి వచ్చే పైప్‌లైన్ వద్ద పనిచేస్తున్న వాటర్‌సప్లై సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించాలని ఏఐటీయుసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐటీయుసీ నాయకులు వినోద్‌కుమార్ మాట్లాడుతూ గొల్లపల్లి నుంచి హిందూపురం మధ్య నాలుగు పంప్‌హౌస్‌లున్నాయని ఇందులో 25మంది సిబ్బంది పనిచేస్తున్నట్లు తెలిపారు. వీరికి ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వలేదన్నారు. అంతేకాక ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా లేదన్నారు. వెంటనే పెండింగ్ వేతనాలు ఇవ్వకపోతే ఈనెల 24నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు మారుతిరెడ్డి, రమేష్, హరి, ఓబులేసు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భూములు ఇవ్వడానికి ససేమిరా..!

-వెనుదిరిగిన కలెక్టర్

పావగడ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): హుస్సేన్‌పురం, రాప్టే గ్రామ పంచాయతీ పరిధిలోని రైతుల నుంచి విద్యుత్ సోలార్ తయారీ కోసం భూములు కొనుగోలు చేసేందుకు బుధవారం కలెక్టర్ వచ్చారు. అయితే తమ భూములు సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించిన ధరకు తాము ఇవ్వమని ససేమిరా అని అనడంతో కలెక్టర్ శుభకల్యాణి వెనుదిరిగారు. సమావేశం ప్రారంభంకాగానే రూ. 20 లక్షలకు ఇవ్వాలని కలెక్టర్ కోరగా రూ. 40 లక్షలు ఇస్తేనే తాము భూములు ఇస్తామని ఖరాఖండిగా రైతులు చెప్పారు. ఎమ్మెల్యే వెంకటేశ్ సైతం రైతులకు నచ్చజెప్పేయత్నంచేసినా వారు వినిపించుకోలేదు. దీంతో కలెక్టర్ అసంతృప్తితో వెనుదిరిగారు. కార్యక్రమంలో తహసీల్దార్ వరదరాజు, ఈఓ జానకీరామ్, ఏసీ శివప్ప, కౌన్సిలర్ రవి, రాజేష్, పారిశ్రామికవేత్త ఎగువపల్లి నాని తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

గ్రామీణ రహదారులకు మహర్దశ

మంత్రి చొరవతో రోడ్లకు మరమ్మతులు

శరవేగంగా సాగుతున్న పనులు


పరిగి-తిరుమలదేవరపల్లి రోడ్డు నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి (ఫైల్)

పరిగి, జూన్18(ఆంధ్రజ్యోతి): రహదారులకు మహర్దశ వచ్చింది. అవసరమైన ప్రదేశాల్లో సీసీ రోడ్డు పనులు, గుంతలమయమైన, బాగులేని రోడ్లకు మరమ్మతులు జరుగుతున్నాయి. మండల కేంద్రం నుంచి తిరుమలదేవరపల్లి, మూడిండ్లపల్లి, అక్కంపల్లి, బసవనపల్లి, పుట్టగూర్లపల్లి, విట్టాపల్లి, గ్రామాలకు వెళ్లాలంటే మట్టిదారులు, గుంతల్లో రవాణాదారులు సర్కస్ చేస్తూ గమ్యాన్ని చేరుకునేవారు. గత వైసీపీ హయాంలో వాటిని పట్టించుకోకపోవడంతో అవి మరింత దారుణంగా తయారయ్యాయి. ఎన్నిసార్లు అధికారులు, నాయకులకు రోడ్లకు సంబంధించి సమస్యలను విన్నవించినా బాగుచేసిన దాఖలాలు గ్రామస్థులు, ప్రయాణికులు అంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో గ్రామీణాభివృద్ధి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పల్లెటూరి రహదారులకు మరమ్మతుల చేయిస్తున్నారు. ఊటకూరు నుంచి అక్కంపల్లికి ప్రజలు వెళ్లాలంటే దారికూడా లేకపోయింది. ఈ నేపథ్యంలో మంత్రి సవిత చొరవతో రైతులు తమ సొంత పొలాలకు దారికోసం కొంతమేర భూమిని వదులుకోవడానికి ముందుకు వచ్చారు. దీంతో ఆ గ్రామానికి రూ.కోటి నిధులతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొన్ని సంవత్సరాల నుంచి పరిగి నుంచి తిరుమలదేవరపల్లికి దాదాపు 3. కి.మీల మట్టిరోడ్డు ఉంది. వర్షం వస్తే చాలా వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. అంతేకాకుండా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు సైతం ఇబ్బందిని ఎదుర్కొన్నారు. బురదరోడ్డులో వాహనాలు ముందుకుసాగక యాక్సిడెంట్లు సైతం జరిగేవని అంటున్నారు. ఇదే విషయాన్ని స్థానిక టీడీపీ నాయకులు మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లగా రూ.కోటి నిధులతో రహదారి నిర్మాణానికి భూమిపూజ చేశారు. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కొడికొండ-శిర హైవే నుంచి బసవనపల్లికి సీసీరోడ్డును ప్రారంభించారు. విట్టాపల్లి సీసీ రోడ్డుకు రూ.కోటితో పనులు ప్రారంభించారు. మూడిండ్లపల్లికి చిన్నపల్లి-పైడేటి రోడ్డుకు రూ.కోటితో రహదారి నిర్మించి అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారు. దీంతో రహదారుల సమస్య తీరుతోందని వాహనచోదకులు, గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంతోషంగా ఉంది


విద్యా, వైద్యం, నిత్యావసర సరుకుల కోసం పరిగి వెళ్లాల్సి వస్తుంది. తిరుమలదేవరపల్లి నుంచి పరిగికి మట్టి గుంతల దారిలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందుదు పడేవాళ్లం. అయితే మంత్రి సవిత చొరవతో రహదారికి మరమ్మతులు జరుగుతున్నాయి. పనులు వేగవంతంగా చేస్తున్నందుకు సంతోషంగా ఉంది.

-పురుషోత్తం, తిరుమలదేవరపల్లి

రవాణా సమయం తగ్గింది


బసవనపల్లి నుంచి కొడికొండ-శిర హైవే మీదుగా గ్రామం నుంచి కూరగాయలు, మల్బరీ, పట్టుగూళ్ల విక్రయాల కోసం హిందూపురం వెళ్లడానికి రవాణా సమయం తగ్గింది. మునపటి దారిలో హిందూపురం చేరుకోవాలంటే 15కిలో మీటర్ల ప్రయాణం చేయాల్సి వచ్చేది. ఇప్పుడు ఏడు కిలోమీటర్ల దూరంలో హిందూపురం చేరుకుంటున్నాం.

-మల్లి, బసవనపల్లి రైతు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


మార్కెట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, జూన్18(ఆంధ్రజ్యోతి): ప్రతి సమస్య పరిష్కారమే లక్ష్యమని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు అన్నారు. బుధవారం పట్టణంలో టీ టైమ్ విత్ ఎమ్మెల్యే నిర్వహించారు. పట్టణంలోని 17, 4వ వార్డుల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా తెలుసుకొన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యల నెలకొందని తెలుపగా వెంటనే సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ జగన్నాథ్‌ను ఆదేశించారు. మార్కెట్‌ను సదర్శించి వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం నుంచి వచ్చే తల్లికి వందనం, పెన్షన్‌లు, రేషన్ తదితర సంక్షేమ పథకాలు అందుతున్నాయా..? లేదా..? తదితర వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు నరసింహరాజు, బలరాం, ఉమాశంకర్, మేఘన రమేష్, నాగేంద్ర, పట్టణ యువత అధ్యక్షులు తిమ్మరాజు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే 'పల్లె నిద్ర'

అమరాపురం(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కారానికి పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. మంగళవారం అమరాపురం మండల పరిధిలోని వి అగ్రహారం గ్రామంలో నిర్వహించిన పల్లెనిద్రలో ఎమ్మెల్యేతో పాటు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామంలోనే బసచేశారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు

పల్లెనిద్రలో భాగంగా అగ్రహారం గ్రామానికి స్మశానవాటిక స్థలం లేదని, కేటాయించాలని ఎమ్మెల్యే దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే స్థలాన్ని వెంటనే కేటాయించాలని తహసీల్దార్ లక్ష్మీనరసింహను ఆదేశించారు. దీంతో బుధవారం గ్రామ పొలిమేర సమీపంలో సర్వేనంబరు 360-3బిలో 3.25ఎకరాల స్థలాన్ని స్మశానవాటిక కోసం చూపించినట్లు తహసీల్దార్ లక్ష్మీనరసింహ, రెవెన్యూ కార్యదర్శి రవికుమార్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రొళ్ల(ఆంధ్రజ్యోతి): పంచాయతీకి చెందిన బేల్దార్ జయమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంది. ఈ నేపథ్యంలో సీఎం సహాయనిధి నుంచి రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి బాధిత కుటుంబానికి అందజేశారు.

పాలన గాడిలో పడేనా..?

ఏడాదిగా ఇన్‌చార్జిలే దిక్కు

ఎట్టకేలకు రెగ్యులర్ తహసీల్దార్ నియామకం

మండల ప్రజలకు తప్పనున్న తిప్పలు


బాధ్యతలు స్వీకరిస్తున్న నటరాజ్

చిలమత్తూరు, జూన్ 18(ఆంధ్రజ్యోతి): నెల రోజులు కాదు... రెండు నెలలు కాదు ఏకంగా ఏడాది కాలంగా రెగ్యులర్ తహసీల్దార్ లేక ఇన్‌చార్జ్ అధికారులతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. దీంతో కార్యాలయం వ్యవస్థ గాడి తప్పింది. అయితే ప్రస్తుత బదిలీల్లో ఎట్టకేలకు మండల తహసీల్దార్‌గా నటరాజ్‌ని నియమితులయ్యారు. దీంతో కార్యాలయంలో వ్యవస్థ గాడిన పడేనా అని లబ్ధిదారులు అంటున్నారు. ఈ ఏడాది కాలంగా తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బంది విధుల్లో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తూ వచ్చారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రజలకు జవాబుదారిగా ఉండాల్సిన వారు నిత్యం సొంతపనులకే పరిమతమయ్యారన్న విమర్శలు ఉన్నాయి. ప్రతి చిన్న పనికి సైతం కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చిందని లబ్ధిదారులు అంటున్నారు. దీనికితోడు వీఆర్‌ఓల సంఖ్య తక్కువగా ఉండటంతో ఒక్కో వీఆర్‌ఓకు అదనంగా మరో ఒకటి రెండు గ్రామాల బాధ్యతలు అప్పగించారు. ఇది కూడా వారు ఇష్టానుసారంగా విధులు నిర్వహించడానికి అవకాశంగా మారిందని అంటున్నారు. దీనికితోడు మండలంలో ఒక పక్క పరిశ్రమల కోసం భూసర్వే జరుగుతుండగా, మరోవైపు గత భూసర్వేలో అన్యాయం జరిగిన వారు ఇప్పటికీ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కార్యాలయంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌లుగా ఉన్న వారు ఎక్కువ సమయం కేటాయించకపోవడంతో బాధితుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి.

సిబ్బంది నిర్లక్ష్యానికి అడ్డుకట్టపడేనా..?

ఏడాది కాలంగా కార్యాలయంలో రెగులర్ తహసీల్దార్ లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించారు. బాధ్యతగా ఉండాల్సిన వారు ఆదాయం కోసం వెంపర్లాడారన్న వాదనలు వినిపిస్తున్నాయి. పైసా ఇస్తేనే పని అనేస్థాయికి దిగిజారినట్లు ఆరోపణలు ఉన్నాయి. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసే అధికారి కార్యాలయంలో లేకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరించారని, ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా వారిలో మార్పు రాలేదని లబ్ధిదారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రెగ్యులర్ తహసీల్దార్‌గా నియమితులైన నటరాజ్ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యానికి, ఆగడాలకు అడ్డుకట్ట వేస్తారా..? అని అంటున్నారు.

బాధ్యతల స్వీకరణ

రెగ్యులర్ తహసీల్దార్‌గా నటరాజ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యాలయంలో పాలన అదుపుతప్పిందని, దానిని గాడిలో పెట్టాలని వారు తహసీల్దార్‌కు సూచించారు.

బాగా చదివి మంచిపేరు తేవాలి

మున్సిపల్ చైర్మన్ రమేష్


విద్యాకిట్లు అందుకున్న విద్యార్థులతో మున్సిపల్ చైర్మన్

హిందూపురం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యాకిట్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన యూనిఫాం, పుస్తకాలు, బెల్ట్, బూట్లు అందజేస్తున్నామన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి విద్యార్థులకు అందిస్తున్న కిట్లు ఎంతో నాణ్యతగా ఉన్నాయన్నారు. ధర్మపురంలోని దుర్గాబాయ్‌దేశ్‌ముఖ్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో విద్యాకిట్లను అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అయూబ్, ఎంఈఓ గంగప్ప, హెచ్‌ఎం పెన్నోబుళం, సూర్యనారాయణ, ప్రసన్నలక్ష్మీ, సిద్దగిరి శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల అందజేత

పట్టణంలోని పాంచజన్య బ్రిలియన్స్ పాఠశాలలో 10వ తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను బుధవారం అందజేశారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున హాజరై విద్యార్థులకు రూ.10వేలు నగదు, సర్టిఫికెట్లను, మొమెంటోను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, కౌన్సిలర్ ఇర్షాద్, ఏఓ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాపై విస్తృత ప్రచారం

ఎంజీఎం మైదానంలో ప్రహరీలపై యోగాంధ్ర బొమ్మలు ఏర్పాటు చేస్తూ ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. బుధవారం ఎంజీఎం క్రీడామైదానంలో గోడలపై యోగాంధ్ర బొమ్మలను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ వాణి, ఏఈ ధీరజ్, నాయకులు దుర్గానవీన్, పాల్గొన్నారు.

విద్యార్థుల పడిగాపులు

హిందూపురం, జూన్18(ఆంధ్రజ్యోతి): హిందూపురం మండలంలోని మలుగూరు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాలకు ప్రిన్సిపాల్ రాకపోవడంతో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు మూడు రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌ను నియమించారు. ఆయనకూడా సోమవారం నుంచి రాకపోవడంతో 10వ తరగతి, ఇంటర్ పూర్తయిన వారు టీసీల కోసం పాఠశాల వద్ద వేచి ఉన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయం

- ఎంపీ బీకే పార్థసారథి


మాట్లాడుతున్న ఎంపీ బీకే పార్థసారథి

పెనుకొండ, జూన్ 18(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని కూటమి అధికారంలోకి వచ్చిన యేడాదిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి బాటలో పరుగులు తీస్తుందని హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం పెనుకొండ ఎంపీ కార్యాలయంలో ఆయన సమస్యలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పెనుకొండ మండలం గొందిపల్లి, చంద్రగిరి, వెంకటగిరిపాళ్యం, రొద్దం మండలం బొక్సంపల్లి, ఎం.కొత్తపల్లి, తదితర గ్రామాల్లో నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రేషన్ బియ్యం, పెన్షన్ తీసుకోవాలన్నా వేరే గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. ఈ గ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన వెంటనే టెలికాం జీఎంతో మాట్లాడి సమస్య వివరించి కొత్తగా సెల్‌టవర్లు ఏర్పాటు చేయాలని కోరారు. వివిధ సమస్యలపై ప్రజలు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జీవీపీ నాయుడు, దేవా నరసింహప్ప, వీజీపాళ్యం శ్రీనివాసులు, సూర్యనారాయణరెడ్డి, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి గుడి నిర్మాణానికి రూ.12 లక్షలు

రొద్దం, జూన్18(ఆంధ్రజ్యోతి): చిన్నమంతూరు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి ఎంపీ బీకే పార్థసారథి రూ. 12 లక్షల ఎంపీ నిధులు విడుదల చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. బుధవారం రొద్దం మండల పరిధిలోని ఆర్.మరువపల్లిలో బీకే స్వగృహంలో చిన్నమంతూరు గ్రామానికి చెందిన గ్రామస్థులు దేవాలయ నిర్మాణానికి సహాయం చేయాలని కోరగా నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చిన్నమంతూరు టీడీపీ నాయకులు యర్రిస్వామి, వెంకటేశులు పాల్గొన్నారు.

నోటీసులు ఇవ్వండి

అరసెంటు స్థలం కోసం.. కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రొద్దం, జూన్ 18(ఆంధ్రజ్యోతి): దొడగట్ట గ్రామంలో వృద్ధురాలు ఇమాంబీ అరసెంటు స్థలం వివాదం పరిష్కారానికి ఇరు వర్గాలకు నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు సర్వేయర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిసింది. బుధవారం ఆంధ్రజ్యోతిలో అరసెంటు స్థలం కోసం.. అన్న కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు స్థల వివాదంపై సర్వేయర్లతో చర్చించారు. వారికి నోటీసులు అందజేసి దొడగట్ట గ్రామానికి వెళ్లి స్థల సమస్యను కచ్చితంగా పరిష్కరించాలని ఆదేశించినట్లు సమాచారం.

'పొలం పిలుస్తోంది'పై అవగాహన

అగళి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగేలింగహళ్లి గ్రామం రైతు సేవా కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ అధికారి నాగరాజు పొలం పిలుస్తుంది కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో వేరుశనగ సాగుచేసే రైతులు రైతు సేవా కేంద్రాల్లో పంట సాగు నమోదు చేయించుకోవాలన్నారు. అన్నదాత సుఖీభవ కోసం ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రసాయన ఎరువులపై కాకుండా సేంద్రీయ ఎరువులపై దృష్టిసారించాలని సూచించారు. అదే విధంగా రైతు సేవా కేంద్రాన్ని పరిశీలించి వేరుశనగ బస్తాలను పరిశీలించారు.

'పార్టీ బలోపేతానికే కమిటీలు'

సోమందేపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామస్థాయి నుంచి కమిటీలు ఏర్పాటుపై బుధవారం పరిశీలకులు వేణుగోపాల్‌రెడ్డి సోమందేపల్లికి వచ్చి పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులను కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో టీడీపీ శ్రేణులతో ఆయన పలు అంశాలపై చర్చించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడానికి బూత్ కమిటీ, గ్రామ కమిటీ, మండల కమిటీలను పారదర్శకంగా చేపట్టినట్లు కన్వీనర్ వెంకటేశులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు, ఆకుల రమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల పరిసరాలు శుభ్రం

పరిగి, జూన్18(ఆంధ్రజ్యోతి): పెద్దరెడ్డిపల్లిలోని ప్రాథమిక పాఠశాల ప్రాంతంలో అపరిశుభ్రత నెలకొనడంతో టీడీపీ నాయకులు శుభ్రం చేయించారు. బుధవారం ఉదయం ఎక్స్‌కావేటర్‌తో పాఠశాల పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, జూలరెడ్డి, శివ, హరికుమార్, పీఆర్ అశోక్, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో విఫలం: వైసీపీ

పెనుకొండ రూరల్, జూన్ 18(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ నాయకులు, రాష్ట్ర బోయ వాల్మీకి మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ బోయ నరసింహులు, మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ నారాయణస్వామి, కేశవ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

అగళి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయశాఖ అధికారిగా నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మేలుకలిగేలా పనిచేస్తానన్నారు. రైతులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జయచంద్ర

అగళి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): అగళి మోడల్ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా జయచంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఎంఈఓ-2 చంద్రశేఖర్‌నాయుడు తెలిపారు. మోడల్ పాఠశాలలో 14 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. ఏడుగురు మోడల్ పాఠశాలకు వచ్చినట్లు తెలిపారు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

సోమందేపల్లి, జూన్ 18(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో మంగళవారం సాయంత్రం సుబ్బేనాయక్ (68) గుండెపోటుతో మృతిచెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని పాతూరులో జామియా మసీదు సమీపంలో నివాసముండే రిటైర్డ్ ఉద్యోగి సుబ్బేనాయక్ వాక్ చేయడానికి గ్రౌండ్‌కు వచ్చాడు. వాకింగ్ చేస్తుండగా ఆయాసం రావడంతో పక్కనే ఉన్న బండరాయిపై కూర్చుని ఫోన్‌లో మాట్లాడుతూ కుప్పకూలాడు. ఏఎస్ఐ మురళి, హెడ్ కానిస్టేబుల్ సుధాకర్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిస్థితి సమీక్షించారు. అనంతరం స్థానిక వైద్యులను రప్పించి పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ఆధార్ నెంబర్ ఆధారంగా సుబ్బనాయక్‌గా గుర్తించి ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించడం జరిగిందని పోలీసులు తెలిపారు.


సుబ్బేనాయక్ మృతదేహం